


# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని జూబ్లీహిల్స్ నివాసంలో కలిసి క్యాన్సర్ అట్లాస్ ఆఫ్ తెలంగాణ ను అందజేసిన ప్రభుత్వ సలహాదారు , ప్రముఖ క్యాన్సర్ వైద్యనిపుణులు నోరి దత్తాత్రేయ.
–హైదరాబాద్,మే 15 (వార్తాప్రభ) :

| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 44 | ది. 16-5-2026 | శనివారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 44 | Date : 16-5-2026 | Saturday | Pages : 8 | Rs.1/- |

# రాయలసీమ నుంచే 5వ జనరేషన్ ఫైటర్ జెట్లు

- ఆత్మనిర్భర్ లక్ష్యంలో ఆమ్కా ప్రాజెక్టు ముందడుగు
- 36 రోజుల్లో జెట్ స్పీడ్ లో ఈ ప్రాజెక్టుకు అనుమతులు
- ప్రధాని మోదీ ఇచ్చిన పొదుపు ఉద్యమానికి ఏపీ సారథ్యం
- త్వరలో బంగారం ఉత్పత్తికి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్
- కేంద్ర మంత్రి రాజ్ నాథ్‌సింగ్‌తో కలిసి ఆమ్కా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన సీఎం చంద్రబాబు
- ఏపీ అంటే అడ్వాన్స్‌ప్రదేశ్ : రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కితాబు





**పుట్టపర్తి, మే 15 (వార్తాప్రభ) :** అడ్వాన్స్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ ప్రాజెక్టు సహా వివిధ డిఫెన్సు యూనిట్లతో దేశానికి రక్షణ కవచంగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలోని ఆమ్కా ప్రాజెక్టుతో ప్రధాని మోదీ ఆశిస్తున్న ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని సాధించే అవకాశం ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ఆమ్కా ప్రాజెక్టు సహా ఇతర రక్షణ రంగ ప్రాజెక్టులకు కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. డీఆర్డీఓలో భాగమైన ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలోని అడ్వాన్స్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్, ఫ్లైట్ టెస్టింగ్ ప్రాజెక్టు శిలాఫలకాన్ని ఇరువురు నేతలు ఆవిష్కరించారు. త్రివిధ దళాలకు రక్షణ ఉత్పత్తులను తయారు చేయనున్న కల్యాణీ స్ట్రాటజిక్ సిస్టమ్స్ ఆధ్వర్యంలోని ఆగ్నేయాస్త్ర ఎనర్జిటిక్స్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, హెచ్ఎఫ్ సీఎల్ ప్రాజెక్టుల శిలాఫలకాలను కేంద్ర మంత్రితో కలిసి సీఎం ప్రారంభించారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లులోని డ్రోన్ సిటీలో ఏర్పాటు కానున్న 5 డ్రోన్ తయారీ, టెక్నాలజీ కంపెనీలను కూడా వర్చువల్ గా శంకుస్థాపన చేశారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."సత్యసాయి బాబా బోధనలతో ఈ ప్రాంతం నుంచి విశ్వ శాంతికి బాటలు పడ్డాయి. ఇప్పుడు పుట్టపర్తిలో ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో అడ్వాన్స్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ ప్రాజెక్టు రావటం ఎంతో కీలకంగా మారింది. దేశం గర్వించే వ్యూహాత్మకమైన రక్షణ కేంద్రంగా పుట్టపర్తి మారుతుంది. ఆమ్కా ప్రాజెక్టుతో ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యసాధనలో ఏపీ ముఖ్యపాత్ర పోషిస్తుంది. భారత రక్షణ రంగాన్ని ఆధునీకరించటంతో పాటు బలోపేతం చేయటంపై ప్రధాని దృష్టి సారించారు. ఆధునిక తరం స్టెల్త్ యుద్ధ విమానాలను తయారు చేసేలా ఇలాంటి ప్రాజెక్టు ఏర్పాటు అవుతోంది.





భారత రక్షణ శక్తిని ప్రపంచానికి చాటటంలో ఆపరేషన్ సింధూర్ ఓ ప్రత్యక్ష ఉదాహరణ. ఆపరేషన్ సింధూర్ లో వినియోగించిన డ్రోన్లు ఏపీలోనే తయారై, టెస్ట్ చేశారు. ఇలాంటి ప్రాజెక్టును ఏపీకి కేటాయించినందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ధన్యవాదాలు. రూ.15 వేల కోట్లకు పైగా పెట్టుబడితో 7,500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే ప్రాజెక్టు వస్తుంది. ఫైటర్ జెట్ ఇంటిగ్రేషన్ తో పాటు ఫ్లైట్ టెస్టింగ్ కేంద్రంగా పుట్టపర్తి మారుతుంది. అత్యంత వేగంగా ఈ ప్రాజెక్టును సాకారం చేయటంలో రక్షణ శాఖ, కేంద్ర ప్రభుత్వ సహకారం అందించాయి." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**రోజుల వ్యవధిలోనే అమ్కా ప్రాజెక్టు సాకారం..** "కేవలం 36 రోజుల్లోనే ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగలిగామని.. జెట్ స్పీడ్‌తో అనుమతులిచ్చామని సీఎం వివరించారు. ఏరోస్పేస్ రంగంలో కీలకమైన ఈ ప్రాజెక్టుతో పాటు మరికొన్ని డిఫెన్సు ప్రాజెక్టులు కూడా వస్తున్నాయి. భారత్ ఫోర్జ్, హెచ్ఎఫ్ సీఎల్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, కర్నూలు జిల్లాలో డ్రోన్ సిటీలకు శంకుస్థాపన చేశాం. ఇటీవల యుద్ధాల్లో డ్రోన్లే కీలకంగా మారాయి. వ్యవసాయం నుంచి చాలా రంగాల్లో డ్రోన్ల వినియోగం పెరిగింది. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేసి ఉత్పత్తి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. శ్రీహరికోట అంతరిక్ష శక్తి, నాగాయలంకలో క్షిపణిశక్తి, పుట్టపర్తి రక్షణ శక్తి, విశాఖ నుంచి నౌకాదళ శక్తితో మొత్తం దేశానికే రక్షణ కవచంగా ఏపీ నిలుస్తుంది. కూటమి అధికారంలోకి వచ్చాకే రాయలసీమకు నీరిచ్చి లక్ష కోట్లతో హార్టికల్చర్ హబ్ గా మారుస్తున్నాం. రాయలసీమలో ఇనుప ఖనిజం, సున్నపురాయి లాంటి ఖనిజ వనరుల్ని సమర్ధంగా వినియోగించుకుంటాం. కడప స్టీల్ ప్లాంటు 2027 డిసెంబరు నాటికి పూర్తి చేస్తాం. స్టీల్, సిమెంట్ ప్లాంట్లు, సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు సీమ కేంద్రంగా మారుతుంది. డిఫెన్స్, స్పేస్ , ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్ లాంటి పరిశ్రమలతో రాయలసీమ రతనాల సీమగా మారుస్తాం. కొప్పర్తి పారిశ్రామిక నోడ్ ఎలక్ట్రానిక్స్ తయారీ హబ్‌గా మారుతుంది. తిరుపతిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ ప్లాంట్, శ్రీహరి కోట సమీపంలో స్పేస్ సిటీ ఏర్పాటు చేస్తాం. కియా పరిశ్రమ ఏటా 18 లక్షల కార్లు తయారు చేస్తోంది. కరవు సీమలో తయారైన కార్లు 80 దేశాల్లో తిరుగుతున్నాయి. రాయలసీమలోని ఆర్డీటీ సంస్థకు విదేశీ విరాళాల విషయంలో సమస్య ఉత్పన్నం అయితే కేంద్రంతో మాట్లాడి మంత్రి లోకేష్ ఆ సమస్యను పరిష్కరించారని" సీఎం వెల్లడించారు.

**గతంలో కేజీఎఫ్ ఇప్పుడు జేజీఎఫ్..** "త్వరలో కర్నూలు జిల్లా జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్ నుంచి బంగారం ఉత్పత్తి జరుగుతుంది. జీ+ఖీలో ఈ ఏడాది 600 కేజీల బంగారం ఉత్పత్తి అవుతుంది. రెండో ఏడాది 1,500 కిలోల బంగారం తయారవుతుంది. రానున్న రోజుల్లో బంగారం ఉత్పత్తికి ఏపీ కీలకంగా మారుతుంది. సమర్ధవంతమైన నీటి నిర్వహణతో జలాశయాలు నీటితో కళకళలాడుతున్నాయి. అభివృద్ధిని బుల్లెట్ స్పీడ్ తో తీసుకెళ్తున్నాం. అవకాశాలు తెచ్చే బాధ్యత మాది. వాటిని అందిపుచ్చుకునే బాధ్యత యువతది. గత పాలనలో విధ్వంసం చేశారు. పరిశ్రమలు తరిమేశారు. సాగునీటి రంగాన్ని నిర్లక్ష్యం చేశారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో మళ్లీ ఏపీ బ్రాండ్ ను పునరుద్ధరించాం. 23 నెలల్లో 23 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం. వీటివల్ల 24 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. యువతకు ఇక్కడే ఉద్యోగాలు రావాలి, ఇతరులకూ ఇక్కడే ఉపాధి కల్పించేలా పరిశ్రమలు వస్తున్నాయి. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ లాంటి ప్రాజెక్టులు వచ్చాయి. రిలయన్స్, బీపీసీఎల్ లాంటి ప్రాజెక్టులు వస్తాయి. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రంగా మూడు ఎకనామిక్ రీజియన్లలో పెట్టుబడులు వస్తాయి. చిప్ నుంచి షిప్ వరకూ మన దేశంలోనే తయారు కావాలని ప్రధాని మోదీ పిలుపు ఇచ్చారు. ఏపీలో డిజైన్ చేయండి, పెట్టుబడులు పెట్టండి, ఉత్పత్తులు తయారు చేయండి అని పారిశ్రామిక వేత్తల్ని కోరుతున్నాను. పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా ఏపీలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం... వేగంగా అనుమతులు ఇస్తున్నాం. దేశానికి తిరుగులేని

## గ్లోబల్ డిఫెన్స్ మ్యాప్‌లో ఏపీ.. పవన్ కల్యాణ్ ప్రశంసలు

- పుట్టపర్తిలో యుద్ధ విమానాల తయారీ పరిశ్రమకు శంకుస్థాపన
- చారిత్రాత్మక ఘట్టమన్న పవన్ కల్యాణ్
- పారిశ్రామికంగా ఏపీ వేగంగా అభివృద్ధి చెందుతోందని వ్యాఖ్య



**పుట్టపర్తి, మే 15 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ డిఫెన్స్ మ్యాప్‌లో నిలిపే దిశగా రూ. 15,803 కోట్ల భారీ పెట్టుబడితో కూటమి ప్రభుత్వం చేపట్టిన మెగా ప్రాజెక్టులపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఏపీ పారిశ్రామిక చరిత్రలోనే ఇదొక చారిత్రాత్మక ఘట్టమని ఆయన అభివర్ణించారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో 650 ఎకరాల్లో ఏర్పాటు కాబోతున్న 'ఎయిర్‌క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్ అండ్ ఫ్లైట్ టెస్ట్ సెంటర్' దేశ రక్షణలో కీలకం కానుంది. స్వదేశీ సాంకేతికతతో తయారవుతున్న ఐదో తరం స్టెల్త్ యుద్ధ విమానం 'ఆమ్కా' ప్రాజెక్టులో ఏపీ భాగస్వామ్యం కావడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఇది ప్రధాని మోదీ 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి మరింత బలాన్ని చేకూరుస్తుందని తెలిపారు. ఈ భారీ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో సుమారు 7,500 మంది యువతకు హై–వాల్యూ టెక్నాలజీ రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. కేవలం విమానాల తయారీ మాత్రమే కాకుండా, రాష్ట్రంలో అత్యాధునిక 'డ్రోన్ ఎకోసిస్టమ్'ను అభివృద్ధి చేయడం ద్వారా డ్రోన్ టెక్నాలజీలో కూడా ఏపీ అగ్రగామిగా నిలవబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతోందని పవన్ కొనియాడారు. ఈ భారీ ప్రాజెక్టు ఏపీకి రావడానికి సహకరించిన ప్రధాని మోదీకి, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## మొదటి ఏడాది లోనే ఓ అండ్ ఎం పనులకు 708 కోట్లు

- మూడో విడత లో 397 కోట్ల తో పనులు
- జూన్ మొదటి వారం లోగా కాలువల తవ్వకం పనులు పూర్తి చేయాలి
- మంత్రి నిమ్మల రామానాయుడు

**విజయవాడ,మే 15 (వార్తాప్రభ) :** ఐదేళ్ల జగన్ అరాచక పాలనలో కాలువల వ్యవస్థ అస్తవ్యస్తమైపోయిందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆవేదన చెందారు. నిర్వహణ పనులు నీటికి వదిలేసారని ఆయన ధ్వజమెత్తారు. ఓఅండ్ఎం పనులు, వెలిగొండ ప్రాజెక్టు పనుల పురోగతి పై ఇరిగేషన్ అధికారులతో మంత్రి నిమ్మల రామానాయుడు శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మొదటి సంవత్సరంలోనే రెండు విడతలుగా ఓఅండ్ఎం పనుల కోసం708 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. నేడు కాలువల్లో తూడు, గుర్రపుడెక్క, పూడికతీత, వంటి అత్యవసర, మరమ్మత్తులు పనుల కోసం 397 కోట్లు కేటాయించా మన్నారు. గత 5ఏళ్ళ వైసిపి పాలనలో కాలువల్లో తూడు,గుర్రపుడెక్క, పూడికతీత వంటి కనీస నిర్వహణ పనులు చేయలేదన్నారు. ఆ కారణంగానే అన్నదాతలకు అపార నష్టం జరిగిందన్నారు. అత్యవసర పనులు కోసం 10లక్షలు దాటితే, కాలయాపన లేకుండా, 7 రోజుల్లోనే షార్ట్ టెండర్లు పిలిచేలా కేబినెట్ ఆమోదించిన విషయాన్ని తెలియజేశారు.



మొత్తం 6,502 పనుల్లో 5,943 పనులు సుమారు 91 శాతం సాగు నీటి సంఘాల ద్వారానే పనులు జరుగనున్నాయని వివరించారు. ఖరీఫ్ నాటికి ఓఅండ్ఎం పనులు పూర్తిచేసేలా సిఈ స్థాయి నుండి కిందిస్థాయి అధికారులు వరకు పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఓఅండ్ఎం పనులకు సంబంధించి, ప్రతి వారం, పనుల వివరాలు, వర్క్ ప్రోగ్రెస్ రిపోర్టు అందించాలని నిమ్మల ఆదేశించారు. జలధారకు, ఓఅండ్ఎం పనులను కూడా సమన్వయం చేసి, భూగర్భ జలాలు పెంచడానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈనెలలో జలధారపై కేంద్ర జలశక్తి మంత్రి సి. ఆర్.పాటిల్, ముఖ్యమంత్రి చంద్రబాబు, కలెక్టర్లు, ఇరిగేషన్ అధికారుతో కాన్ఫరెన్స్ నిర్వహిస్తారన్నారు. ఈ సమీక్ష లో ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శశిభూషణ్, కడా కమిషనర్ ప్రశాంతి, ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్సి నరసింహమూర్తి, సీఈలు, ఎస్ ఈలు, ఈఈ లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మహానాడు 2026 వర్చువల్ పద్ధతిలో నిర్వహణ





**అమరావతి, మే 15 (వార్తాప్రభ) :** తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టే మహానాడు కార్యక్రమం ఈసారి రెండు రోజుల పాటు వర్చువల్ పద్ధతిలో నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశిం చారు. రాష్ట్ర కమిటీ సభ్యులు మొత్తం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో అందుబాటులో ఉండాలని ఆదేశించిన ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు.మహానాడును ఆన్‌లైన్‌లో జరపాలని చంద్రబాబు నిర్ణయం పొదుపు చర్యల్లో భాగంగా కీలక నిర్ణయం తీసుకున్న సీఎం చంద్రబాబు.ఎన్టీఆర్ భవన్‌లో స్టేజీ ఏర్పాటు చేసి ఆన్‌లైన్‌లో నిర్వహించాలని నిర్ణయం రాష్ట్రవ్యాప్తంగా 1,845 క్లస్టర్లలో స్క్రీన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయం. ఎన్టీఆర్ భవన్ నుంచి పొలిట్బ్యూరో సభ్యులు పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలని చంద్రబాబు ఆదేశించారు.

**ప్రత్యేక గ్రీవెన్స్ రాసాభాస..!**

- కుంటముక్కల గ్రామంలో ప్రత్యేక గ్రీవెన్స్(పీజీ ఆర్ఎస్) కు సమస్యల వెల్లువ

- 8లో

## కూటమి పాలన రాష్ట్ర యువతకు స్వర్ణ యుగంలా మారింది

–మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



**అమరావతి,మే 15 (వార్తాప్రభ) :** కూటమి పాలన రాష్ట్ర యువతకు స్వర్ణ యుగంలా మారిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. శుక్రవారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో మంత్రి మాట్లాడుతూ....కూటమి పాలన రాష్ట్ర యువతకు స్వర్ణ యుగంలా మారింది. రాష్ట్రంలో యువతకు ఓవైపు పెట్టుబడులు, పరిశ్రమలతో ఉపాధి అవకాశాలు కల్పిస్తూ.. మరో వైపు ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీతో ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తున్నాం. యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న 1523 ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి నేడు నోటిఫికేషన్ విడుదల చేశాం. ఎన్నో ఏళ్ల నుంచి ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేస్తున్నాం. ఏ పత్రికలు చూసిన వాటి నిండా ఉద్యోగాల ప్రకటనలే, ఏ ప్రాంతంలో చూసిన యువత ముఖాల్లో చిరునవ్వులే. మెగా డిఎస్సితో 16 వేల టీచర్ ఉద్యోగాలు భర్తీ చేశాం. దివ్యాంగ బ్యాక్లాగ్, ఎస్సీ ఎస్టీ బ్యాక్లాగ్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాం. ఎన్నికల్లో చెప్పిన విధంగా ఉద్యోగాలు భర్తీ చేస్తున్నాం. ఇది యువ నాయకుడు, మంత్రి లోకేశ్ చిత్తశుద్ధి, కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం. గత 5 ఏళ్ళు జగన్ నిరుద్యోగుల్ని నమ్మించి మోసం చేశారు.

**మహారాజశ్రీ కృష్ణాజిల్లా మచిలీపట్నం 1 అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో**
I.A.No.122/2024 in
O.S.No. 212/2024
Between:
మోగంటి జగన్మోహనరావు
-----పిటీషనర్/వాది
మరియు
అక్కిశెట్టి పాండురంగారావు
-----రెస్పాండెంట్/ప్రతివాది
TO:-
**రెస్పాండెంట్/ప్రతివాది :**
అక్కిశెట్టి పాండురంగారావు
S/o.గంగయ్య
R/o.D.No.6/10,రామరాజులంక,
మల్కిపురం-మండలం,
తూర్పు గోదావరి జిల్లా.
పై నెంబరు I.A.122/2024in O.S. 212/2024లో రెస్పాండెంట్/ప్రతివాది అయిన మీకు నోటీసు నిమిత్తం ది 18.06.2026 నకు వాయిదా అయియున్నది. కావున సదరు వాయిదారోజున ఉదయం గం. 10.30ని.లకు పైకోర్టు వారి యెదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యెడల మీపరోక్షమున తదుపరి గ్రంధములు జరుపబడును.
**(శ్రీకోర్టు వారి ఉత్తర్వులప్రకారం)**
**ఇట్లు**
**పేర్ని సురేష్ బాబు**
**న్యాయవాది, మచిలీపట్నం**

**మహారాజశ్రీ కృష్ణాజిల్లా మచిలీపట్నం 1 అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో**
O.S.No. 212/2024
Between:
మోగంటి జగన్మోహనరావు
-----వాది
మరియు
అక్కిశెట్టి పాండురంగారావు
-----ప్రతివాది
TO:-
**ప్రతివాది :**
అక్కిశెట్టి పాండురంగారావు
S/o.గంగయ్య
R/o.D.No.6/10,రామరాజులంక,
మల్కిపురం-మండలం,
తూర్పు గోదావరి జిల్లా.
పై నెంబరు O.S. 212/2024 లో ప్రతివాది అయిన మీకు నోటీసు నిమిత్తం ది 18.06.2026 నకు వాయిదా అయియున్నది. కావున సదరు వాయిదారోజున ఉదయం గం. 10.30ని.లకు పైకోర్టు వారి యెదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యెడల మీపరోక్షమున తదుపరి గ్రంధములు జరుపబడును.
**(శ్రీకోర్టు వారి ఉత్తర్వులప్రకారం)**
**ఇట్లు**
**పేర్ని సురేష్ బాబు**
**న్యాయవాది, మచిలీపట్నం**



## తుమ్మిడి గ్రామంలో పర్యటించిన జిల్లా కలెక్టర్



**పెడన,మే 15 (వార్తాప్రభ) :** స్మశాన వాటిక అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పెడన నియోజకవర్గంలోనీ మండల కేంద్రమైన పెడనలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక... మీకోసం కార్యక్రమం నిర్వహించిన అనంతరం జిల్లా కలెక్టర్ బంటుమిల్లి మండలంలో పర్యటించారు. తొలుత మండలంలోని పెద్ద తుమ్మిడి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఆఖరి మజిలీ... స్మశాన వాటికను పరిశీలించారు. ఈ సందర్భంగా కన్సల్టెంట్ ఇంజనీర్ బసవేశ్వర బాబు మాట్లాడుతూ ప్రస్తుతం స్మశాన వాటికలో ప్రహరీ రెండు ద్వారాలు దహన వేదిక నిర్మాణం జరుగుతుందని కలెక్టర్కు వివరించారు. ఇదివరకు స్మశాన వాటికకు రావాలంటే కంపచెట్లతో చాలా ఇబ్బంది పడే వారమని గ్రామ నివాసి ఆస్ట్రియాలో హెచ్ఆర్ కన్సల్టెంట్ గా పని చేస్తున్న వీరంకి నరసింహస్వామి తన సొంత నిధులతో స్మశాన వాటిక నిర్మించేందుకు ముందుకు వచ్చారని వారి సమీప బంధువు వీరంకి రమేష్, గ్రామస్తులు కలెక్టర్కు తెలిపారు. ప్రధాన రహదారి నుండి స్మశాన వాటికకు 5 కిలోమీటర్ల రహదారి ఏర్పాటు చేయాలని వర్షం వచ్చినప్పుడు స్మశాన వాటికలో నీరు నిలిచి ఇబ్బందిగా ఉందని, కొంత మట్టితో మెరక చేయవలసిన అవసరం ఉందని గ్రామస్తులు కలెక్టర్కు విజ్ఞప్తి చేశారు. దీంతో జిల్లా కలెక్టర్ వెంటనే స్పందిస్తూ రహదారి నిర్మాణానికి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సెల్ఫోన్లో పంచాయతీరాజ్ ఎస్ ఈ రమణ రావుకు సూచించారు. స్మశాన వాటికను ఎంతో ప్రశాంతమైన ప్రదేశంగా తీర్చిదిద్దాలని మంచి రంగులు వేయాలని లోపల మెరక చేయాలని సూచించారు. అనంతరం దహన వేదిక నిర్మాణ పనులు కలెక్టర్ ప్రారంభించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట తహసిల్దారు పూర్ణచంద్రరావు ఎంపీడీవో శివప్రసాద్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు మజిలీ ప్రచారకర్త భువనరాజు తదితర అధికారులు అనధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులకు ఆశీస్సులు అందించిన డాక్టర్ జి.వి.ఆర్



**విస్సన్నపేట,మే 15 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని వేమిరెడ్డిపల్లి టిడిపి గిరిజన నాయకులు భూక్యాలాలు కుమారుని వివాహ వేడుకలో వధూవరులను డాక్టర్ జిబిఆర్ తమ ఆశీస్సులు అందించారు.

## పత్తిపాటి పుల్లారావు కు కొత్త నాగేంద్రబాబు అభినందనలు



**ఏలూరు,మే 15 (వార్తాప్రభ) :** టీడీపీ జోనల్ కో. ఆర్డినేటర్ మాజీ మంత్రివర్యులు పత్తిపాటి పుల్లారావుని కలిసి శుభాకాంక్షలు, అభినందనలు తెలిపిన ఉమ్మడి కృష్ణా జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, టీడీపీ మాజీ రాష్ట్ర కార్యదర్శి, కైకలూరు నియోజకవర్గ టీడీపీ నేత కొత్త నాగేంద్రకుమార్ (నాగబాబు) ఈ జోన్ కో ఆర్డినేటర్ గా సుదీర్ఘ అవగాహన కలిగిన మాజీ మంత్రివర్యులు శ్రీ పత్తిపాటి పుల్లారావు గారితో ఏలూరు జిల్లా లో పార్టీ పరిస్థితుల గురించి మరియు కైకలూరు నియోజకవర్గం లో పార్టీ విషయాల గురించి భవిష్యత్ లో పార్టీ సంస్థాగతంగా బలపడే విధంగా తీసుకోవాల్సిన చర్యలను ముఖ్యంగా పార్టీ పదవుల విషయంలో సోషియల్ ఇంజనీరింగ్ లో జరిగిన లోపాలను సరిదిద్దడానికి తగు సూచనలు అధినాయకత్వానికి ఇవ్వాలి అని కోరారు.



శ్రీ మద్ భగవద్గీత 18 అధ్యాయాలు మెమొరైజేషన్ 2025-26 సం.నకు గాను మైసూర్ దత్తపీఠం ఆధ్వర్యంలో నిర్వహించినశ్రీ మద్ భగవద్గీత 18 అధ్యాయాలు కంఠస్థంగా చెప్పి పరీక్షలలో మచిలీపట్నం సర్కిల్ పేటకు చెందిన శ్రీమతి అడపా రంగమణి గారు ఉత్తమ శ్రేణి లో గోల్డ్ మెడల్ సాధించి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ వారి చేతుల మీదుగా మైసూర్ ఆశ్రమం నందు గోల్డ్ మెడల్ మరియు ప్రశంశా పత్రము అందుకున్నారు.

-మచిలీపట్నం,మే 15 (వార్తాప్రభ) :



## రంగయ్య అప్పారావుపేటలో భక్తులను కటాక్షిస్తున్న శ్రీ కోదండరామ స్వామి వారు





**హనుమాన్ జంక్షన్,మే 15 (వార్తాప్రభ) :** బాపులపాడు మండలం, కృష్ణా జిల్లా, రంగయ్య అప్పారావుపేట లో వేంచేసి ఉన్న శ్రీ కోదండరామ స్వామి దేవస్థానం భక్తుల విశ్వాసానికి నిలయంగా నిలుస్తోంది. భక్తుల కోరికలు తీర్చే కొంగుబంగారంగా ప్రసిద్ధి చెందిన శ్రీ కోదండరామస్వామి వారి దర్శనం కోసం పరిసర గ్రామాల నుంచే కాకుండా బాపులపాడు మండలంలోని పలు గ్రామాల నుంచి కూడా భక్తులు తరలి వస్తున్నారు. అలంకార భూషితంగా పుష్పమాలలతో, సంప్రదాయ ఆభరణాలతో విరాజిల్లుతున్న స్వామివారి దివ్య రూపం భక్తులను ఆధ్యాత్మిక భావనలో ముంచేస్తోంది. ప్రతిరోజూ జరిగే గోత్రనామాలతో పుష్పార్చన, పర్వదినాల్లో జరిగే ఉత్సవాలు ఆలయ మహిమాన్వితను ప్రతిబింబిస్తున్నాయి. గ్రామ ప్రజల ఐకమత్యంతో ఆలయంలో ధార్మిక కార్యక్రమాలు వైభవంగా జరుగుతున్నాయి. స్వామి వారి జన్మ నక్షత్రం పునర్వసు నక్షత్రం రోజున స్వామివారికి పంచామృత అభిషేకం, స్వామివారికి గోత్రనామాలతో పుష్పార్చన, సుందరకాండ పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం, మణిద్వీప వర్ణన పారాయణం, శ్రీరామ మూల మంత్రం శ్రీరామ జయరామ జై జై రామ పారాయణం వంటి కార్యక్రమాలు ప్రతినెలా నిర్వహిస్తున్నారు. శ్రీరామనవమి రోజున సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహించి భక్తులకు అన్నప్రసాద వితరణ, గ్రామంలో దేవాలయానికి రాలేని వృద్ధులకు ప్రసాదాలు ఇంటి వద్దకే పంపిస్తున్నారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నారు. దసరా నవరాత్రులలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్న ప్రసాద వితరణ చేస్తున్నారు. ధనుర్మాసంలో ప్రతిరోజు ఉదయం నాలుగు గంటలకు శ్రీ గోదా రంగనాథ స్వామి వారిలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలు నివేదన చేసి భక్తులకు అందజేస్తున్నారు. భోగి రోజున శ్రీ గోదా రంగనాథ స్వామి వార్ల కళ్యాణం ఘనంగా నిర్వహించి భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తున్నారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని 30 రోజులపాటు హనుమాన్ చాలీసా పారాయణం ప్రతిరోజు భక్తులు వివిధ రకాలు ప్రసాదాలు ఏర్పాటు చేసి స్వామివారికి నివేదన చేస్తారు. హనుమాన్ జయంతి రోజున ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తున్నారు. కార్తీక మాసంలో ఉదయం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించి ఆకాశ దీపాన్ని వెలిగిస్తారు. సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం కార్యక్రమం నిర్వహిస్తారు. పరమశివుని జన్మ నక్షత్రం ఆరుద్ర నక్షత్రం రోజున అన్న ప్రసాద వితరణ చేస్తారు. ప్రతి సంవత్సరం ఏరువాక పౌర్ణమి రోజున దేవాలయం సంప్రోక్షణ, కుంబాభిషేకం నిర్వహిస్తారు. చైత్రమాసంలో గ్రామ దేవత గంగానమ్మకు జల జాతర నిర్వహించి, ప్రత్యేక పూజలు చేసి, కుంభం పోస్తారు. ఆషాడ మాసంలో శ్రీ కోదండ రామస్వామి వారి దేవస్థానం నుండి గ్రామ దేవత గంగానమ్మకు ఆషాడం సారె పంపించడం గత కొన్ని సంవత్సరాలుగా ఆనవాయితీగా వస్తుంది. శ్రీ కోదండరామ స్వామి వారి కృపతో అనేక మంది భక్తులు తమ కోర్కెలు నెరవేరిన అనుభవాలను తనతో పంచుకుంటున్నారని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ సామవేదం అరుణ్ కుమార్ శర్మ తెలియజేశారు. "భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం --- రంగయ్య అప్పారావుపేట శ్రీ కోదండరామ స్వామి" అని స్థానికులు భక్తులు విశ్వసిస్తున్నారు. దాతల సహకారంతో అభివృద్ధి పదంలో రంగయ్య అప్పారావుపేట కోదండ రామస్వామి దేవస్థానం రంగయ్య అప్పారావుపేట గ్రామస్తుల ఐక్యత, భక్తుల అంకితభావం, దాతల సహకారంతో రంగయ్య అప్పారావుపేటలోని శ్రీ కోదండ రామస్వామి దేవస్థానం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోంది. గ్రామ ప్రజలు అందరూ కలిసి, దాతల సహకారంతో ఆలయ అభివృద్ధికి కృషి చేయడంతో దేవస్థానంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు దిగ్విజయంగా పూర్తి చేశారు. ఆలయ ప్రాంగణ పరిశుభ్రత, విద్యుత్ దీపాల ఏర్పాటు, ఆలయం చుట్టూ ప్రహరీ, దేవాలయం చుట్టూ ప్రదక్షిణ చేయడానికి వీలుగా ఫ్లోరింగ్, ప్రసాదాలు తయారు చేయడానికి పాకశాల, స్టోర్ రూమ్, దేవాలయంలో గ్రానైట్, దేవాలయానికి నైరుతిలో మండపం, దేవాలయానికి రంగులు, స్వామి వారి ఆభరణాలు భద్రపరచడానికి లాకర్, స్వామి వారి పవళింపు సేవకు స్టీల్ ఉయ్యాలా, సీసీ కెమెరాలు, ఏర్పాటు చేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే ప్రతి పండుగను గ్రామస్తులు ఐక్యంగా నిర్వహిస్తూ భక్తి భావాన్ని పెంపొందిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామ ప్రజల సహకారంతో ఆలయానికి మరింత వైభవం తీసుకురావాలని కమిటీ సభ్యులు ఆకాంక్షించారు. "గ్రామస్తుల ఐక్యతే దేవాలయ అభివృద్ధికి ప్రధాన బలం" అని శ్రీ కోదండ రామస్వామి వారి ఆలయ అభివృద్ధి పనుల పర్యవేక్షకులు పరుచూరి రామకృష్ణ, పరుచూరి సుకన్య అభిప్రాయం వ్యక్తం చేశారు.

## ట్రెండ్ సెంటర్ కలగర రామచంద్రపురం (లక్ష్మీపురం) పంచాయతీ



**విస్సన్నపేట,మే 15 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో కలగర రామచంద్రపురం ( లక్ష్మీపురం) గ్రామపంచాయతీ గత కొద్ది కాలంగా పతాక స్థాయిలో వార్తలుకు ఎక్కుతూ ట్రెండ్ సెంటర్ గా ఎన్టీఆర్ జిల్లా పార్లమెంట్ లో మారిందంటే ఎలాంటి అతిశయోక్తి లేదు అని చెప్పాలి. ధాన్యం కొనుగోలు జరగటం లేదు గన్ని బ్యాగ్స్ అందటం లేదు అని రైతుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించిన పంచాయితీ పరిధిలో ధాన్యం కొనుగోలు సమయంలో అవకతవకలు జరిగినట్లు తిరువూరు శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు ప్రత్యక్షంగా ఆగ్రహం వ్యక్తం చేయటం మండల టిడిపి నాయకత్వం ఖండన ఇవ్వటం సర్వత్రా తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సహకార సంఘం ఎన్నికల సమయంలో డి పద్మజ్యోతి శాసనసభ్యురాలుగా సేవలందిస్తున్న సమయంలో కలగర గ్రామం గురించి కొంత రాజకీయ చర్చ జరిగింది. వైసీపీ ప్రభుత్వ పరిపాలనలో నాటి గ్రామ సర్పంచ్ దేశి రెడ్డి రమా శ్రీనివాసరెడ్డి సేవలందించారు. ఇటీవల జరిగిన రీ సర్వేలో ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంగా వ్యవహరించి గన్ని బ్యాగ్స్ అందించి లారీలు పంపటంతో సమస్య సద్దుమనగటం ఈ కార్యక్రమానికి ముందు ఏపీఎస్ఓపి సీఏ చైర్మన్ ఎస్ దేవదాస్ లారీలు గన్ని బ్యాగ్స్ రైతులకు అందుబాటులో ఉంటాయని హామీ విధితమే. రిసర్వే కార్యక్రమంలో భాగంగా తిరువూరు ఆర్డీవో కుమార్ జిటి వర్క్స్ కలగర గ్రామంలో శుక్రవారం పరిశీలించారు. రైతులతో ముఖాముఖి ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ కే లక్ష్మి కళ్యాణి రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎన్ఆర్ఐ గిరిబాబు ఒక ధ్రువతారల ప్రత్యక్షం కావడం అప్పటివరకు మండల టిడిపికి దిశా నిర్దేశం ప్రస్ఫుటంగా కనపడని పరిస్థితులలో మహాసముద్రంలో దిక్కులు తెలిపే దిక్సూచిలా మండలం 4 దిక్కుల ఉన్న పేదల వైద్య సేవలకు వివాహాది కార్యక్రమాలకు బదులు గుడులు చర్చిల అభివృద్ధికి తానున్నానని ఆర్థిక భరోసా ఇవ్వటమే కాకుండా మండల విద్యాశాఖకు కంప్యూటర్లు చైర్స్, యువతకు క్రికెట్ కిట్లు, తాత కుంట్ల గ్రామంలో షామియానా బహుకరణ చశీద్రుపట్ల ఎల్టి తండాలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు అదనపు స్థల సేకరణకు ఆర్థిక వితరణ లక్ష్మీపురం గ్రామంలో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు ఆయన ఉదారత మండలంలో ముస్లిం సోదరుల ఇఫ్తార్ విందులలో చేయూత వీటన్నిటిని మించి మండలంలో టిడిపి మెజార్టీ కి పోల్ మేనేజ్మెంట్ లో అపార అనుభవం కలిగిన రాజకీయ చాణిక్యులతో సంబంధ బాంధవ్యాలు స్నేహపూర్వక వాతావరణం ట్రెండు సెట్ చేసే విస్సన్నపేట మండల టిడిపి టార్చి బేరర్ ఎన్ఆర్ఐ గిరి కావటం ప్రతి టిడిపి కార్యకర్తకు తెలిసిందే. రాబోయే మండల ప్రజా పరిషత్ జడ్పిటిసి గ్రామపంచాయతీల ఎన్నికలలో వల్లభనేని గిరి పాత్ర ప్రముఖంగా ఉంటుందని విశ్వసనీయ వర్గాల సమాచారం అందుతోంది.

## పదవ తరగతి లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుపతులు



**హనుమాన్ జంక్షన్,మే 15 (వార్తాప్రభ) :** బాపులపాడు మండలం రేమల్లె గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులైన పరికల గీతిక మొదటి బహుమతి, గుంటకాని స్రవంతి రెండవ బహుమతి గా నిలిచిన విద్యార్థులకు యనమదల భీమశంకర శ్రీనివాసరావు, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు కలపాల రాధాకృష్ణ నగదు బహుమతులను అందజేశారు. యనమదల భీమశంకర శ్రీనివాసరావు ఫస్ట్ ప్రైజ్ 14000 రూపాయలు, సెకండ్ ప్రైజ్ 11000 రూపాయలు అందించారు. అలాగే కలపాల రాధాకృష్ణ మొదటి బహుమతి 2000 రూపాయలు, మరియు రెండవ బహుమతి 1500 రూపాయలు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి శ్రీనివాసరావు, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కొల్లూరు చంద్రకాంత్,ప్రధాన కార్యదర్శి ఈడే నారాయణ,ఉపాధ్యాయ సిబ్బంది, పాఠశాల యాజమాన్య కమిటీ, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు,గ్రామ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## 7సీస్ ఏ ఐ ఆధారిత గేమింగ్, డిజిటల్ కంటెంట్ విస్తరణ

### -7సీస్ ఎంటర్టైన్మెంట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎల్ ఎం శంకర్



7SEAS ENTERTAINMENT LTD

**హైదరాబాద్,మే 15 (వార్తాప్రభ) :** 7సీస్ ఎంటర్టైన్మెంట్ లిమిటెడ్ ఏ ఐ ఆధారిత గేమ్ డెవలప్మెంట్, సినిమాటిక్ కంటెంట్ సృష్టిలో తన వ్యూహాత్మక విస్తరణను ప్రకటించింది, ఏ ఐ ఆధారిత గేమింగ్ ఆవిష్కరణను భారతదేశం యొక్క ప్రారంభ స్వీకరించేవారిలో ఒకటిగా నిలిచింది. గేమ్ డిజైన్, యు ఐ / యు ఎక్స్ , త్రీ డీ క్యారెక్టర్ క్రియేషన్, ఎన్విరాన్మెంట్ జనరేషన్, యానిమేషన్, వాయిస్ జనరేషన్, ఏ ఐ ని ఏకీకృతం చేస్తోంది. "వేగవంతమైన అభివృద్ధి, మెరుగైన విజువల్స్, స్మార్ట్ గేమ్ తో లీనమయ్యే కథ చెప్పడం ద్వారా ఏఐ గేమింగ్ ను మారుస్తుందని మేనేజింగ్ డైరెక్టర్ ఎల్ ఎం శంకర్ చెప్పారు.

**ఏ ఐ ఆధారిత గేమింగ్ లో ప్రారంభ నాయకత్వం :** తదుపరి తరం అభివృద్ధి పైప్ లైన్లతో ఏ ఐ ఆధారిత గేమింగ్ విభాగంలో వ్యూహాత్మకంగా ప్రవేశించిన భారతదేశంలో ప్రారంభ గేమింగ్ కంపెనీలలో 7సీస్ ఎంటర్టైన్మెంట్ లిమిటెడ్ ఒకటి. కంపెనీ గేమ్ డిజైన్, 3ఞ క్యారెక్టర్ మోడలింగ్, ఎన్విరాన్మెంట్లు, ఎన్ సీ ప్రవర్తన, రేసింగ్ ఫిజిక్స్, వాయిస్ లోకలైజేషన్, క్యూ ఏ ఆటోమేషన్, ఆస్తి ఉత్పత్తి , వ్యక్తిగతీకరించిన గేమ్ ప్లేలో ఏ ఐ ని ఏకీకృతం చేసింది. కంపెనీ ప్రకారం,ఏ ఐ స్వీకరణ వాస్తవికత, సామర్థ్యం, స్కేలబిలిటీ , లీనమయ్యే ఆటగాళ్ల అనుభవాలను పెంచేటప్పుడు అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసింది.

**క్రిస్మస్ కు ముందు రాబోయే గేమ్ విడుదల :** దాని విస్తరణ రోడ్ మ్యాప్ లో భాగంగా, క్రిస్మస్ సెలవుదినానికి ముందు బహుళ కొత్త అప్ గ్రేడ్ చేసిన గేమింగ్ శీర్షికలను అభివృద్ధి చేసి విడుదల చేయాలని కంపెనీ యోచిస్తోంది.

**ట్రెజర్ కింగ్ :** లీనమయ్యే అన్వేషణ, వ్యూహాత్మక గేమ్ ప్లే, డైనమిక్ వాతావరణాలు, ఏ ఐ మెరుగైన కథను కలిగి ఉన్న ప్రతిష్టాత్మక ఓపెన్-వరల్డ్ యాక్షన్-అడ్వెంచర్ స్ట్రాటజీ గేమ్.

**ఫార్ములా రష్ :** వాస్తవిక రేసింగ్ ఫిజిక్స్, అధునాతన ఏ ఐ ప్రత్యర్థి వ్యవస్థలు , దృశ్యమానంగా లీనమయ్యే రేసింగ్ అనుభవాలతో రూపొందించబడిన తరువాతి తరం కార్ రేసింగ్ గేమ్.

**అప్ గ్రేడ్ చేసిన అనుకరణ గేమ్ లు :** మెరుగైన గ్రాఫిక్స్, ఏ ఐ ఆధారిత గేమ్ ప్లే సిస్టమ్ లు, తెలివైన వాతావరణాలు, మెరుగైన ప్లేయర్ ఎంగేజ్ మెంట్ ఫీచర్లను కలిగి ఉన్న కంపెనీ సిమ్యులేషన్ గేమింగ్ పోర్ట్ ఫోలియో యొక్క మెరుగైన వెర్షన్లు.

**భవిష్యత్తు కోసం విజన్ :** 7సీస్ ఎంటర్టైన్మెంట్ లిమిటెడ్ గేమింగ్, సినిమాటిక్ స్టోరీ టెల్లింగ్, ఏ ఐ సృష్టించిన కంటెంట్ ప్రపంచ ప్రేక్షకుల కోసం లీనమయ్యే డిజిటల్ అనుభవాలను మిళితం చేసే ఏ ఐ ఆధారిత వినోద పర్యావరణ వ్యవస్థను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఏ ఐ ఉత్పత్తి , ఆవిష్కరణలను పెంచుతుండగా, మానవ సృజనాత్మకత , కథ చెప్పడం వినోదంలో ప్రధానమైనదిగా ఉంటుందని కంపెనీ పేర్కొంది. కంపెనీ దశలవారీ పెట్టుబడుల ద్వారా తన సాంకేతిక మౌలిక సదుపాయాలు, ప్రత్యేక ఏ ఐ బృందాలను విస్తరిస్తోంది. 7సీస్ ఎంటర్టైన్మెంట్ ఎల్ కె ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ 2026 లో దాని ఏ ఐ షార్ట్ ఫిల్మ్ శాండ్ అండ్ ఫైర్ కోసం గుర్తింపు పొందింది, ఇది ఏ ఐ సహాయక సినిమా కథ చెప్పడం , తరువాతి తరం డిజిటల్ కంటెంట్ పై పెరుగుతున్న దృష్టిని ప్రతిబింబిస్తుంది.

**7సీస్ ఎంటర్టైన్మెంట్ లిమిటెడ్ గురించి :** 7సీస్ ఎంటర్టైన్మెంట్ లిమిటెడ్ అనేది మొబైల్ గేమ్స్, ఇంటరాక్టివ్ ఎంటర్టైన్మెంట్ , ఏఐ-ఆధారిత డిజిటల్ కంటెంట్పై దృష్టి సారించిన భారతదేశానికి చెందిన గేమింగ్ కంపెనీ. ప్రపంచ ప్రేక్షకుల కోసం తదుపరి తరం వినోద అనుభవాలను నిర్మించడానికి కంపెనీ ఏ ఐని గేమ్ డెవలప్ మెంట్ , సినిమాటిక్ కంటెంట్ సృష్టిలో చురుకుగా ఏకీకృతం చేస్తోంది. ఏ ఐ ని గేమ్ డెవలప్ మెంట్, సినిమాటిక్ కంటెంట్ సృష్టిలో చురుకుగా ఏకీకృతం చేస్తోంది.

## లయన్స్ సేవా మహోత్సవం 42 కుట్టుమిషన్లు అందజేత



**విస్సన్నపేట,మే 15 (వార్తాప్రభ) :** స్థానిక లయన్స్ క్లబ్ ఆఫ్ విస్సన్నపేట ఆధ్వర్యంలో కూనపురాజు పర్వ గ్రామంలో మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి 42 కుట్టుమిషన్లను లయన్స్ సేవా మహోత్సవశీ కార్యక్రమంలో భాగంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి జిల్లా గవర్నర్ వివిపిఎస్ ఆంజనేయులు, ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ టీ దుర్గా మల్లేశ్వరరావు, వైస్ డిస్టిక్ గవర్నర్ డాక్టర్ వై గాంధీ, డిస్టిక్ క్యాబినెట్ సెక్రటరీ ఎం చక్రధర్ డిస్టిక్ జిఎస్టి కోఆర్డినేటర్ కె.వి.ఆర్.ఎన్ ముత్య ప్రసాద్, రీజియన్ చైర్ పర్సన్ డాక్టర్ బి మహేంద్ర, జోన్ చైర్ పర్సన్ పి వెంకటేశ్వరరావు, డిస్టిక్ గెస్ట్ డాక్టర్ ఎస్టీ వెంకటేశ్వరరావు, డిస్టిక్ అంబాసిడర్ నర్సిరెడ్డి నరెడ్ల, డిప్యూటీ డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ సిజెడబ్ల్యూకే బాబు, మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోయ సుధ అధ్యక్ష కార్యదర్శులు అరుణకుమారి జగన్మోహన్ రెడ్డి కోశాధికారి బి రవి మోహన్, లయన్స్ కార్యవర్గ సభ్యులు జువ్వా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు పనుల నాణ్యతా ప్రమాణాలను పరిశీలించిన క్వాలిటీ కంట్రోల్ ఈఈ దుర్గా భవానీ



**మోపిదేవి: అవనిగడ్డ,మే 15 (వార్తాప్రభ) :** చల్లపల్లి , మోపిదేవి మండలాల్లో పల్లె పండుగ 2.0 కార్యక్రమంలో భాగంగా నిర్మించిన రోడ్ల పనుల నాణ్యతా ప్రమాణాలను క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించారు. మోపిదేవి - వెంకటాపురం మధ్య పల్లె పండుగ 2.0 కార్యక్రమంలో భాగంగా ఉపాధి నిధులు రూ 97లక్షలతో ఇటీవల నిర్మించిన తారు(బిటి) రోడ్డు నాణ్యతా ప్రమాణాలను క్వాలిటీ కంట్రోల్ ఈఈ జి.దుర్గా భవానీ పరిశీలించారు. శుక్రవారం తమ బృందంతో కలిసి సదరు రోడ్డు నాణ్యతా ప్రమాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఈఈ పనుల నాణ్యత వివరాలను నమోదు చేసుకున్నారు. మోపిదేవి మండలం కొక్కిలిగడ్డ లో రూ 49 లక్షలతో నిర్మించిన బిసి రోడ్డును , చల్లపల్లి మండలం నాదెళ్ళ వారి పాలెం , రాముడు పాలెం గ్రామాల్లో వేర్వేరుగా ఒక్కొక్కటి రూ 49 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లను , లక్ష్మీపురం పంచాయతీ రామానగరంలో రూ 45 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ఈఈ దుర్గా భవానీ నేతృత్వంలోని క్వాలిటీ కంట్రోల్ బృందం పరిశీలించింది. అంచనా నివేదికల మేరకు సదరు పనుల నాణ్యత పట్ల ఈఈ సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. క్వాలిటీ కంట్రోల్ బృందం పరిశీలనలో పిఆర్ డిఇ పగడాల సురేష్ బాబు , ఇంచార్జి ఏఈ బొప్పన శ్రీనివాస్ ,సంబంధిత ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## చిల్లంగి కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా ప్రదోష పూజలు

### -మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు



**కిర్లంపూడి,మే 15 (వార్తాప్రభ) :** కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం చిల్లంగి గ్రామంలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయంలో వైశాఖ బహుళ త్రయోదశి,చతుర్దశి సందర్భంగా ప్రదోష పూజలు,మాస శివరాత్రి వేడుకలు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు,అర్చకులు వెంకట శాస్త్రి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ప్రదోషకాలంలో నందీశ్వర స్వామివారికి విశేష పంచామృతాభిషేకం,పుష్పార్చన ,బిల్వార్చనతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం వైశాఖ బహుళ చతుర్దశి మాస శివరాత్రి సందర్భంగా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం,21 రకాల అభిషేక ద్రవ్యాలతో విశేష పంచామృతాభిషేకం వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాలకు గ్రామ ప్రజలు, శివభక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అభిషేకాలను తిలకించి దివ్య దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి పరమేశ్వరుని అనుగ్రహం పొందారు.ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు,ఆలయ అర్చకులు వెంకట శాస్త్రి పాల్గొన్న భక్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## సుజాతనగర్ మండల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మే 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సుజాతనగర్,రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసే ప్రక్రియలో భాగంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా,రైతులకు నష్టం కలుగకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత శాఖల అధికారులకు ఖచ్చితమైన ఆదేశాలను జారీ చేసింది.ఇందులో భాగంగానే ఇతర శాఖల అధికారులతో సమన్వయం పాటిస్తూ శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా జిల్లాలోని అందరు పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు తమ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తూ ఉండాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. శుక్రవారం నాడు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సుజాతనగర్లోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు సంబంధిత శాఖల అధికారులతో కలిసి రైతులతో సమావేశమయ్యారు.అక్కడ పాల్గొన్న రైతులు ఎస్పీకి తమ సమస్యల గురించి తెలియజేశారు.అ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. ముఖ్యంగా గన్నీ బ్యాగులు,కొనుగోలు చేసిన ధాన్యం రవాణాకు సంబంధించి,ధాన్యాన్ని కప్పి ఉంచడానికి ఉపయోగించే తార్పాలిన్ పట్టాలకు సంభందించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా రైతులకు అండగా నిలబడాలని సూచించారు.ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే సంబంధిత అధికారులతో పాటు పోలీసు వారికి కూడా సమాచారం అందించాలని కోరారు.అనంతరం అక్కడ ధాన్యం కొనుగోలు విధానాన్ని,ధాన్యాన్ని గ్రేడింగ్ చేసే విధానాన్ని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ,ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు,ఎస్సైలు రమాదేవి,రవి మరియు ఇతర శాఖల అధికారులు,సిబ్బందితో పాటు స్థానిక రైతులు పాల్గొన్నారు

## వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులు నాణ్యతతో సకాలంలో పూర్తి చేయండి

**-శాసనసభ్యులు గాంధీ ఆదేశం**



**శేరిలింగంపల్లి,మే 15 (వార్తాప్రభ):**కొండాపూర్ డివిజన్ పరిధిలోని కొత్తగూడా విలేజ్‌లో ఉన్న నెరేళ్ల చెరువులో జరుగుతున్న అభివృద్ధి,సుందరీకరణ పనులను పిఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పరిశీలించారు.ఈ కార్యక్రమంలో మాదాపూర్ డీసీ బాలకృష్ణ,మాజీ కార్పొరేటర్లు హమీద్ పటేల్,నార్నె శ్రీనివాసరావు,రవీందర్ ముదిరాజ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా పిఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ నెరేళ్ల చెరువును సుందరంగా,ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికతో పనులు చేపడుతున్నామని తెలిపారు. చుట్టుపక్కల కాలనీల నుండి వచ్చే మురుగు నీరు చెరువులో కలవకుండా ప్రత్యేక యూజీడీ మళ్లింపు పైప్‌లైన్ నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు.చెరువు కట్ట బలోపేతం, అలుగు మరమ్మత్తులు,ఫెన్సింగ్ ఏర్పాటు,వాకింగ్ ట్రాక్ నిర్మాణం వంటి పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.చెరువు సంరక్షణలో ఎక్కడా రాజీ పడవద్దని స్పష్టం చేశారు.స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించి ఇప్పటికే శుభ్రపరిచినట్లు తెలిపారు.దోమల సమస్య,అనారోగ్య సమస్యలు నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.తామర పువ్వులతో చెరువును మరింత అందంగా తీర్చిదిద్దడంతో పాటు,ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యమని గాంధీ అన్నారు. నియోజకవర్గంలోని అన్ని చెరువులను సుందరీకరించి, కబ్జాలకు గురికాకుండా పూర్తి స్థాయిలో సంరక్షిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు,కాలనీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## బాధ్యతలు స్వీకరించిన రఘునాథ్ యాదవ్



**శేరిలింగంపల్లి,మే 15 (వార్తాప్రభ):**తెలంగాణ యాదవ కో-ఆపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎం.రఘునాథ్ యాదవ్ నేడు బీసీ సంక్షేమ మరియు రవాణా శాఖ మంత్రిని, భోంగీర్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి ఆశీస్సులు తీసుకున్నారు.బీసీ సంక్షేమ పథకాల అమలు,బీసీ శాఖ అభివృద్ధి తదితర అంశాలపై వారితో సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు.తెలంగాణలో బీసీ వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడంపై సమావేశంలో చర్చ జరిగినట్లు పేర్కొన్నారు.

# గోల్డ్ గుబులు...సిల్వర్ సెగలు!!

- పెళ్లిళ్లపై గోల్డ్ ఎఫెక్ట్
- ఆభరణాలే ఇప్పుడు ఆందోళన
- తులం ధరతో కుటుంబాల కలవరము
- ఈఎమ్ఐల వైపు ప్రజల మొగ్గు
- బంగారం భారం... వెండి వెర్రిపై "వార్తాప్రభ" కథనం







**పెద్దపల్లి/ గోదావరిఖని: మే 15 (వార్తాప్రభ ప్రతినిధి)**పెళ్లిళ్ల సీజన్ మొదలైతే బంగారం షాపులు కళకళలాడటం సహజం. కానీ ఈసారి పరిస్థితి మాత్రం పూర్తిగా భిన్నంగా కనిపిస్తోంది. రోజురోజుకు పెరుగుతున్న బంగారం, వెండి ధరలు సామాన్యుడు, మధ్యతరగతి కుటుంబాలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. "పెళ్లి అంటే ఆభరణాలు తప్పనిసరి... కానీ ఇప్పుడు ఆభరణాలు కొనాలంటే అప్పుల పాలవ్వాల్సిందే" అనే పరిస్థితి నెలకొంది.ఒకప్పుడు కూతురు పెళ్లికి కొద్దికొద్దిగా బంగారం కూడబెట్టే కుటుంబాలు ఇప్పుడు ధరలు చూసి షాక్ అవుతున్నాయి. తులం(10 గ్రాములు) బంగారం 1 లక్ష 62 వేలు దిశగా దూసుకెళ్తుండగా, వెండి కూడా సామాన్యుడి అందుబాటుకు దూరమవుతోంది. పెళ్లిళ్లలో మెరిసే నగలు లేకపోతే వేడుకలో అందం తగ్గిపోతుందనే భావన ప్రజల్లో ఉండటంతో, ఎంత కష్టమైనా కొనాల్సిందేనని కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.ముఖ్యంగా మధ్యతరగతి తల్లిదండ్రుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. పెళ్లి ఖర్చులు, ఫంక్షన్ హాళ్లు, క్యాటరింగ్, గిఫ్టులు, దుస్తుల ఖర్చులతోనే ఇబ్బందులు పడుతుండగా... ఇప్పుడు బంగారం ధరలు అదనపు భారంగా మారాయి. కొందరు పాత బంగారాన్ని మార్చుకుంటుండగా, మరికొందరు తక్కువ గ్రాములతో సరిపెట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.జ్యువెలరీ వ్యాపారులు మాత్రం "ధరలు పెరిగినా కొనుగోళ్లు పూర్తిగా తగ్గలేదు. పెళ్లిళ్లు ఉండటంతో ప్రజలు అవసరానికైనా కొనుగోలు చేస్తున్నారు" అంటున్నారు. అయితే పెద్ద మొత్తంలో కొనేవారు తగ్గిపోయారని చెబుతున్నారు. ఈఎంఐలు, గోల్డ్ స్కీమ్స్ వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారని పేర్కొంటున్నారు.ఆర్థిక నిపుణుల అభిప్రాయం ప్రకారం అంతర్జాతీయ మార్కెట్ ప్రభావం, డాలర్ మారకం విలువ, ప్రపంచ ఆర్థిక అనిశ్చిత పరిస్థితుల కారణంగా బంగారం ధరలు పెరుగుతున్నాయి. పెట్టుబడిగా బంగారంపై ఆసక్తి పెరగడం కూడా మరో కారణమని చెబుతున్నారు.ఏదేమైనా... "పెళ్లి అంటే బంగారం" అనే సంప్రదాయం ఉన్న భారతీయ కుటుంబాలకు ప్రస్తుత ధరలు పెద్ద పరీక్షగా మారాయి. ఆభరణాలు లేకపోతే పెళ్లిలో వెలుగు తగ్గిపోతుందనే భావన ఒకవైపు... కొనాలంటే కొంప కొల్లేరు అవుతుందనే భయం మరోవైపు... ప్రజలను తీవ్ర మనోవేదనకు గురిచేస్తోంది.

# స్నిఫర్ డాగ్‌తో విస్తృత తనిఖీలు!!

- గోదావరిఖని బస్టాండ్‌లో పోలీస్ దాడులు
- మత్తు పదార్థాలపై కఠిన చర్యలు
- సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యం
- 1టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి





**పెద్దపల్లి/ గోదావరిఖని: మే 15 (వార్తాప్రభ ప్రతినిధి)** గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ శుక్రవారం బస్టాండ్, బస్సులు, కార్గో పార్సిల్ కేంద్రాలు, దుకాణాలు, పాన్ షాపుల్లో నార్కోటిక్ స్నిఫర్ డాగ్ సహాయంతో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, నార్కోటిక్ వింగ్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్ సమన్వయంతో జరిగిన ఈ తనిఖీల్లో ప్రయాణికుల బ్యాగులు, అనుమానాస్పద వ్యక్తులను పరిశీలించారు. బీహార్‌కు చెందిన ఓ వ్యక్తి వద్ద స్నిఫర్ డాగ్ వాసన చూసి బ్యాగ్ తనిఖీ చేయగా పొగాకు ప్యాకెట్ లభించింది. గంజాయి, మత్తు పదార్థాలు, చిన్నపిల్లలకు మత్తు కలిపిన చాక్లెట్లు, గుట్కా, సిగరెట్లు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బస్సులు, రైళ్లు, ప్రైవేట్ వాహనాల ద్వారా మత్తు పదార్థాలు తరలిస్తున్నారని గుర్తించి, అనుమానాస్పదంగా కనిపించినా వెంటనే స్థానిక పోలీసులకు లేదా యాంటీ నార్కోటిక్ బ్యూరో టోల్ ఫ్రీ 1908, డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా భవిష్యత్తును కాపాడుకోవాలని సూచించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరావు, వన్‌టౌన్ ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, నార్కోటిక్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

# చేప మందు పంపిణీకి అగర్వాల్ సమాజ్ చేయూత

## తెలంగాణ అగర్వాల్ సమాజ్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరేంద్ర గోయల్





**హైదరాబాద్ : మే 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)** చేప మందు పంపిణీకి తెలంగాణ అగర్వాల్ సమాజ్ చేయూత అందించనుంది. హైదరాబాద్‌లో బత్తిని సోదరులు ఇచ్చే ప్రసిద్ధ చేప మందు పంపిణీ ప్రతి ఏటా మృగశిర కార్తె రోజున ప్రారంభమవుతుందని తెలంగాణ అగర్వాల్ సమాజ్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరేంద్ర గోయల్ వెల్లడించారు. తమ సమాజ్ సభ్యులు స్వచ్ఛందంగా ఇందులో పాల్గొంటారని చెప్పారు. చేప ప్రసాదం పంపిణీ కోసం శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ అగర్వాల్ సమాజ్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరేంద్ర గోయల్, శ్వాసకోశ వ్యాధులు, ముఖ్యంగా ఆస్తమా నివారణకు ఈ మందును వేలాది మంది ప్రజలు తీసుకుంటారన్నారు. జూన్ 8 , 9 తేదీల్లో హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో ఉదయం 8:30 గంటలకు ప్రారంభమై, మరుసటి రోజు రాత్రి వరకు నిరంతరాయంగా కొనసాగుతుందని వివరించారు. భక్తుల సౌకర్యార్థం దాదాపు 32 నుండి 34 ప్రత్యేక కౌంటర్లు, 40కి పైగా క్యూలైన్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని తెలిపారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో పంపిణీ కేంద్రం వద్దే చేప పిల్లలను విక్రయిస్తారని, పంపిణీ ప్రాంతంలో వెటర్నరీ వైద్యులు, మత్స్యశాఖ నిపుణులు పర్యవేక్షణలో ఉంటారని వివరించారు. ఈ సమావేశంలో మున్నలాల్ అగర్వాల్, చైర్మన్ , సలహాదారు సురేష్ అగర్వాల్, గోపాల్ మోర్, ఉపాధ్యక్షుడు సీఏ హరిగోవింద్ ప్రసాద్, కార్యదర్శి సీమా జైన్, కోశాధికారి సీఏ రాంగోపాల్ అగర్వాల్, మాజీ అధ్యక్షులు ఆర్.ఎన్.గుప్తా, మాజీ అధ్యక్షులు సురేష్ సింఘాల్, బత్తిని కుటుంబం నుంచి బత్తిని అమర్ నాథ్ గౌడ్, గౌరీ శంకర్ గౌడ్ , చంద్ర శేఖర్ గౌడ్ , షావ శంకర్ గౌడ్, సంతోష్ గౌడ్, అరవింద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**జూన్ 8న చేప ప్రసాదం పంపిణీకి ప్రభుత్వం సిద్ధం :** ప్రతి ఏటా మృగశిర కార్తె రోజున బత్తిన సోదరుల కుటుంబం అందించే చేప ప్రసాదానికి దేశవ్యాప్తంగా ఎంతో గుర్తింపు ఉంది. ఆస్తమా, శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో బాధపడేవారు ఈ ప్రసాదం కోసం వేల సంఖ్యలో హైదరాబాద్‌కు తరలివస్తారు. ఈ ఏడాది జూన్ 8వ తేదీన నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఈ పంపిణీ కార్యక్రమం ఉంటుందని ప్రభుత్వం ప్రకటించింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పంపిణీ సమయం, క్యూలైన్ల నిర్వహణపై అధికారులు ఇప్పటికే ఒక స్పష్టమైన ప్రణాళికను సిద్ధం చేశారు.

**1.25 లక్షల చేప పిల్లలు సిద్ధం :** ఈ కార్యక్రమం కోసం మత్స్యశాఖ ద్వారా సుమారు 1.25 లక్షల చేప పిల్లలను అందుబాటులో ఉంచుతున్నట్లు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. అవసరమైతే ఈ సంఖ్యను మరింత పెంచేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఈ చేప పిల్లలను భక్తులకు సరఫరా చేసే క్రమంలో ఎక్కడా జాప్యం జరగకుండా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. పంపిణీ జరిగే ప్రాంతంలో వెటర్నరీ వైద్యులు, మత్స్యశాఖ నిపుణులు నిరంతరం పర్యవేక్షిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోనున్నారు. దూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వివిధ ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. పోలీస్, ట్రాఫిక్ విభాగం పార్కింగ్ , భద్రతను పర్యవేక్షించగా, జీహెచ్ఎంసీ పారిశుధ్య పనులను, రెవెన్యూ, ఆర్ అండ్ బీ విభాగాలు వసతి కల్పనను చూసుకోనున్నాయి. ఎండ ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున చలువ పందిళ్లు, తాగునీటి సౌకర్యం, అత్యవసర వైద్య శిబిరాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల రద్దీని బట్టి అదనపు బస్సులు, మెట్రో సర్వీసులను నడిపేలా రవాణా శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

వార్తా ప్రభ

# హైదరాబాద్

## ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి.-ఏఐకేఎస్



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మే 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సుజాతనగర్ రాష్ట్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని సిపిఐ మండల కార్యదర్శి కుమారి హనుమంతరావు డిమాండ్ చేశారు శుక్రవారం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో ఏఐకేఎస్ ఆధ్వర్యంలో సుజాతనగర్ తాసిల్దార్ కృష్ణ ప్రసాద్ కు వినతి పత్రాన్ని ఇచ్చారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సభ్యులు పదవి కాలం పూర్తయిన తిరిగి కాంగ్రెస్ కార్యకర్తలకే మళ్లీ పదవులు కట్టబెట్టారని మండిపడ్డారు నామినేటెడ్ పదవులు వద్దు సహకార సంఘం ఎన్నికల ముద్దు అని తెలియజేశారు ప్రభుత్వ ఇప్పటికైనా స్పందించి సహకార సంఘం ఎన్నికలు వెంటనే జరపాలని లేని పక్షంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఏఐకేఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు ప్రభుత్వం రైతాంగ సమస్యలను పట్టించుకోకుండా కాలయాపన చేస్తుందని రైతుల సమస్యలను పరిష్కరించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భూక్య దస్రు సిపిఐ మండల సహాయ కార్యదర్శి తాళ్లూరి ధర్మరావు లావుడియా గోపి ఏఐటీయూసీ మండల అధ్యక్షులు వీర్ల మల్లేష్ సిపిఐ నాయకులు దండు నాగేశ్వరరావు వీర్ల దుర్గాప్రసాద్ దండు సురేష్ బండి రమేష్ భాగం కృష్ణ ప్రజాసంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు

## 355 పడకల ఆస్పత్రి పరిశీలన!!

- నాణ్యత ప్రమాణాలపై కలెక్టర్ దృష్టి
- మౌలిక సదుపాయాల ఏర్పాటుపై సూచనలు
- ప్రజలకు మెరుగైన వైద్యం, అదనపు నిధుల సమన్వయం



**పెద్దపల్లి/ గోదావరిఖని: మే 15 (వార్తాప్రభ ప్రతినిధి)** రామగుండం మున్సిపల్ పరిధిలో నిర్మాణంలో ఉన్న 355 పడకల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి పనులను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో ఆస్పత్రి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రారంభంలో రూ.160.3 కోట్లతో నిధులు మంజూరైనప్పటికీ, ప్రస్తుతం పనులు పూర్తి చేయడానికి రూ.205 కోట్ల వ్యయం అవసరమవుతోందని కలెక్టర్ తెలిపారు. అదనపు నిధుల కోసం సవరించిన అంచనాలను సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌కు పంపినట్లు తెలిపారు. ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేకంగా సమన్వయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఆస్పత్రి నిర్మాణం పూర్తయితే ప్రజలకు సమగ్ర వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని కలెక్టర్ అన్నారు. ఈ పరిశీలనలో ఆర్ అండ్ బి ఈఈ భావ్ సింగ్, వైద్య అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## బరువుగా కాదు.... బాధ్యత గా స్వీకరించండి -ఆర్.జె.డి నాగమణి



**గన్నవరం , మే 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ప్రభుత్వం విద్యా శాఖ ఆధ్వర్యంలో బడి ఈడు పిల్లలు బడి బయట కాదని బడి లోపల అంటూ వారికి కావలసిన అన్ని రకాల వసతులను కల్పిస్తూ విద్యలో ప్రోత్సహిస్తున్న విషయాలను తల్లి దండ్రుల దృష్టిలో పెట్టే ఉపాధ్యాయులు బరువు గా కాకుండా బాధ్యత తీసుకోవాలని కాకినాడ ప్రాంతీయ విద్యా సంచాలకులు నాగమణి అన్నారు. శుక్రవారం నాడు గన్నవరం చెంచుల కాలనీ లో బడి పిలుస్తుంది...రా ప్రత్యేక కార్యక్రమం లో ఆమె ర్యాలీ లో పాల్గొని తల్లి దండ్రులను చైతన్య పరిచారు. ప్రభుత్వ బడి లో తమ పిల్లను చేర్చడం వలన ప్రభుత్వం యూనిఫామ్,బలవర్ధకమైన మధ్యాహ్నభోజనం, అమ్మ ఒడి. నిష్ణాతులైన ఉపాధ్యాయులచే విద్యా బోధన,తదితర అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రయివేటు పాఠశాల రంగులను చూసి ఆకర్షితులు కావద్దని ఆమె తల్లి దండ్రులకు తెలిపారు. ఉపాధ్యాయులు పదవతరగతి అడ్వాన్స్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించే వరకు తరగతులు నిర్వహించాలని సూచించారు. నాగమణి ఇంటింటికి తిరిగి బడి పిలుస్తుంది..... రా అంటూ తిరుగుతుంటే తల్లి దండ్రులు ఆశ్చర్యం గా చూస్తూ తమ పిల్లను బడికి పంపుతామని తెలిపారు. గుడివాడ ఉప విద్యశాఖధికారి కొండా రవి కుమార్ ఆధ్వర్యంలో మండల విద్యా శాఖధికారి 2 ఆర్. కమల, గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు ఏ. సునీల పలువురు ఉపాధ్యాయులు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మండల విద్యా శాఖ వివరాలను నాగమణి తెలిపారు

## హైస్కూల్ ప్లస్‌లో ఖాళీలను అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లతోనే భర్తీ చేయాలి

**జెడ్పి ఉపాధ్యాయులకు అన్యాయం చేస్తే ఉద్యమిస్తాం**

**విజయవాడ, మే 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నీతి ఆయోగ్ సూచించిన విద్యా సవాళ్లను అధిగమించేందుకు, ఆంధ్రప్రదేశ్‌లో హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లతోనే వెంటనే భర్తీ చేయాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కరణం హరికృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.ఖాళీగా ఉన్న 1100 పోస్టులను ఇతరులతో భర్తీ చేయాలని ప్రయత్నిస్తే తీవ్ర ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ పోస్టులను అర్హులైన స్కూల్ అసిస్టెంట్లతో భర్తీ చేస్తే ఎన్నో ఏళ్ల పదోన్నతి కల సాకారం అవుతుందని పేర్కొన్నారు."ఈ చర్య ద్వారా"పదో తరగతి తర్వాత డ్రాప్ అవుట్స్ తగ్గింపు,హయ్యర్ సెకండరీ ప్రవేశాల పెంపు,గ్రామీణ విద్యార్థులకు మెరుగైన అవకాశాలు, విద్యా నాణ్యత బలోపేతం అవుతాయన్నారు.అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లతో ఖాళీల భర్తీ ద్వారానే విద్యా పురోగతి సాధ్యం అవుతుందనీ వారు పేర్కొన్నారు.

# కర్లపాటి ట్రస్ట్ సహకారంతో ఉన్నత విద్య అభ్యాసం , ఉన్నత ఉద్యోగం సాధించిన చరణ్ దీప్ గుప్తా

**కృతజ్ఞతలు తెలుపుతూ ట్రస్ట్ కు లేఖ రాసిన తల్లి కళ్యాణి**
**సేవే మార్గం సహకారమే ట్రస్ట్ లక్ష్యం అన్న కర్లపాటి ట్రస్ట్ నిర్వాహకులు కర్లపాటి శ్రీనివాసరావు**

**జగ్గయ్యపేట మే 15 (వార్తప్రభ)**కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ అండతో చదువును కొనసాగించి ఉన్నత శిఖరాలను అధిరోహించిన విద్యార్థి చరణ్ దీప్ గుప్తాఎం.ఎన్.సి కంపెనీలో హార్డ్ వేర్ ఇంజనీర్గా ఉద్యోగాన్ని సాధించారు.సామాజిక సేవలో నిరంతరం ముందుండే కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ మరో అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకుందని ఆ సంస్థ వ్యవస్థాపకులు సామాజిక వేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు తెలిపారు. పేద విద్యార్థులకు అండగా నిలిచి, వారి చదువులకు ఆసరా కల్పించాలనే ధ్యేయంతో ట్రస్ట్ చేస్తున్న కృషికి నిదర్శనంగా నేడు చరణ్ దీప్ గుప్తా అనే విద్యార్థి ఘన విజయం అన్నారు. శుక్రవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూచరణ్ దీప్ గుప్తా అనే విద్యార్థి ఆర్థిక ఇబ్బందుల వల్ల తన పైచదువులను కొనసాగించలేని స్థితిలో ఉన్నప్పుడు, కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ అతనికి చేయూతనిచ్చింది. బి.టెక్ పూర్తి చేయడానికి అవసరమైన పూర్తి ఆర్థిక సహాయాన్ని దాతల ద్వారా అందించి, అతనికి అండగా నిలిచింది. ట్రస్ట్ అందించిన ఈ ప్రోత్సాహంతో చరణ్ దీప్ తన చదువును విజయవంతంగా పూర్తి చేసి, నేడు ప్రతిష్టాత్మకమైన ఒక మల్టీ నేషనల్ కంపెనీ లో ఉద్యోగాన్ని సంపాదించాడని తెలిపారు. ఈ సందర్భంగా చరణ్ దీప్ గుప్తా మరియు అతని తల్లి కళ్యాణి లు ట్రస్ట్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియచేస్తూ పంపిన కృతజ్ఞతా లేఖను ప్రెస్ కి అంద జేశారు. "తమ కష్ట కాలంలో అండగా నిలిచి, చదువుకు ఆసరా



ఇచ్చిన కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్కు ఎల్లప్పుడూ రుణపడి ఉంటాము" అని వారు భావోద్వేగంతో పేర్కొన్నారు.ట్రస్ట్ ప్రతినిధి కర్లపాటి వెంకట శ్రీనివాసరావు మాట్లాడుతూ "ఒక విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదిగి, తన కుటుంబాన్ని ఆదుకునే స్థితికి రావడం మా ట్రస్ట్కు దక్కిన కర్లపాటి ట్రస్ట్ సహకారంతో ఉన్నత విద్య అభ్యాసం , ఉన్నత ఉద్యోగం సాధించిన చరణ్ దీప్ గుప్తా

**కృతజ్ఞతలు తెలుపుతూ ట్రస్ట్ కు లేఖ ర్యాసిన తల్లి కళ్యాణి**
**సేవే మార్గం సహకారమే ట్రస్ట్ లక్ష్యం అన్న కర్లపాటి ట్రస్ట్ నిర్వాహకులు కర్లపాటి శ్రీనివ్యాసర్యావు**

కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ అండతో చదువును కొనసాగించి ఉన్నత శిఖరాలను అధిరోహించిన విద్యార్థి చరణ్ దీప్ గుప్తాఎం.ఎన్.సి కంపెనీలో హార్డ్ వేర్ ఇంజనీర్గా ఉద్యోగాన్ని సాధించారు.

సామాజిక సేవలో నిరంతరం ముందుండే కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ మరో అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకుందని ఆ సంస్థ వ్యవస్థాపకులు సామాజిక వేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు తెలిపారు. పేద విద్యార్థులకు అండగా నిలిచి, వారి చదువులకు ఆసరా కల్పించాలనే ధ్యేయంతో ట్రస్ట్ చేస్తున్న కృషికి నిదర్శనంగా నేడు చరణ్ దీప్ గుప్తా అనే విద్యార్థి ఘన విజయం అన్నారు. శుక్రవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూచరణ్ దీప్ గుప్తా అనే విద్యార్థి ఆర్థిక ఇబ్బందుల వల్ల తన పైచదువులను కొనసాగించలేని స్థితిలో ఉన్నప్పుడు, కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ అతనికి చేయూతనిచ్చింది. బి.టెక్ పూర్తి చేయడానికి అవసరమైన పూర్తి ఆర్థిక సహాయాన్ని దాతల ద్వారా అందించి, అతనికి అండగా నిలిచింది. ట్రస్ట్ అందించిన ఈ ప్రోత్సాహంతో చరణ్ దీప్ తన చదువును విజయవంతంగా పూర్తి చేసి, నేడు ప్రతిష్టాత్మకమైన ఒక మల్టీ నేషనల్ కంపెనీ లో ఉద్యోగాన్ని సంపాదించాడని తెలిపారు. ఈ సందర్భంగా చరణ్ దీప్ గుప్తా మరియు అతని తల్లి కళ్యాణి లు ట్రస్ట్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియచేస్తూ పంపిన కృతజ్ఞతా లేఖను ప్రెస్ కి అంద జేశారు. "తమ కష్ట కాలంలో అండగా నిలిచి, చదువుకు ఆసరా ఇచ్చిన కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్కు ఎల్లప్పుడూ రుణపడి ఉంటాము" అని వారు భావోద్వేగంతో పేర్కొన్నారు.ట్రస్ట్ ప్రతినిధి కర్లపాటి వెంకట శ్రీనివాసరావు మాట్లాడుతూ.. "ఒక విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదిగి, తన కుటుంబాన్ని ఆదుకునే స్థితికి రావడం మా ట్రస్ట్కు దక్కిన అతిపెద్ద గౌరవం అన్నారు . భవిష్యత్తులో కూడా పేద విద్యార్థులకు ఇలాంటి సహాయ సహకారాలు అందిస్తాం" అనితెలిపారు.అతిపెద్ద గౌరవం అన్నారు . భవిష్యత్తులో కూడా పేద విద్యార్థులకు ఇలాంటి సహాయ సహకారాలు అందిస్తాం" అనితెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ల జోరు



**జగ్గయ్యపేట మే 15 (వార్తప్రభ)**ఈ విద్యా సంవత్సరం నుండి ప్రైవేట్ పాఠశాల నుండి ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులు క్యూ కడుతున్నారు. అందుకు చాలా సంతోషంగా ఉంది అని ఎం ఈ ఓ చిట్టిబాబు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలను ఇప్పుడు పూర్తిగా మారిపోయినవి అని ఎంఈఓ చిట్టిబాబు ఉద్ఘాటించారు . ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం తో పాటు ఉపాధ్యాయులకు నిమిషం ఖాళీ లేకుండా బోధించడమే పనిగా కరికులం తయారు చేయడం జరిగిందని, ఈ విధంగా ప్రజలకు తెలియజేయడం వల్ల అన్ని సౌకర్యాలు కల్పించబడినందువల్ల ప్రభుత్వ పాఠశాలలోనే ఎక్కువ మంది పిల్లలను అడ్మిషన్లు చేయుచున్నామని తెలియజేశారు. అందులో భాగంగానే శు క్రవారం గౌరవరం గ్రామంలో కొంతమంది ప్రైవేట్ పాఠశాల నుండి ప్రభుత్వ పాఠశాలకు జాయిన్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మరియు ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## ప్రజాదర్బారుకు ఆర్టీసీ బస్సులో వెళ్లిన జగ్గయ్యపేట ఎమ్మెల్యే





**జగ్గయ్యపేట మే 15 (వార్తప్రభ)**భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ , ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదర్శవంతమైన పిలుపు ఖర్చుల అదుపు – వనరుల పొదుపు ను జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య) అక్షరాలా నిజం చేసి చూపించారు. విలాసవంతమైన కాన్వాయ్లు, ఆడంబరాలను పక్కన పెట్టి, సామాన్యుడిలా జగ్గయ్యపేట నుంచి గౌరవరం వరకు ఏపీఎస్ఆర్టీసీ బస్సులో ప్రయాణించి అందరికీ ఆదర్శంగా నిలిచారు.బస్సులో తోటి ప్రయాణికులతో ముచ్చటిస్తూ, ఆర్టీసీ సేవలపై అభిప్రాయాలను, వారి వ్యక్తిగత సాధకబాధకాలను అడిగి తెలుసుకుంటూ సాగిన ఈ ప్రయాణం ప్రజల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. నాయకుడంటే ప్రజల కంటే దూరంగా ఉండేవాడు కాదు. ప్రజల గుండెల్లో ఉండేవాడు అని ఎమ్మెల్యే ఈ ప్రయాణం ద్వారా మరోసారి నిరూపించారు.ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్తూ, గౌరవరం గ్రామం, జగ్గయ్యపేట మండలంలో భారీ ఎత్తున ప్రజాసమస్యల పరిష్కార వేదిక 'ప్రజాదర్బారు' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే తాతయ్య స్వయంగా ప్రజల నడుమ కూర్చొని, గ్రామస్తుల సమస్యలను ఓపిగ్గా వింటూ అర్జీలను స్వీకరించారు. ఏ ఒక్కరి సమస్య కూడా పరిష్కారం కాకుండా మిగిలిపోకూడదనే లక్ష్యంతో ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల కోసమే పనిచేస్తుంది. సంక్షేమం, ప్రగతే మా ధ్యేయం. ప్రతి ఒక్కరి సమస్యను పరిష్కరించడమే మా ప్రాధాన్యత. ప్రజాదర్బారుకు వచ్చిన ప్రతి అర్జీని త్వరితగతిన పరిష్కరించాలి. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు అని అధికారులను గట్టిగా హెచ్చరించారు.

## డివిజన్ ఇంచార్జిలతో జనసేన సమీక్ష సమావేశం నిర్వహించిన ఎంపీ బాలశౌరి.



**మచిలీపట్నం మే 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)**బందరు పట్టణ జనసేన పార్టీ డివిజన్ ఇంచార్జిలతో మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి గురువారం బందరు ఎంపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, డివిజన్ స్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఈ సమావేశంలో చర్చించారు.ఈ సమావేశంలో బండి రామకృష్ణ పాల్గొని పార్టీ కార్యకలాపాలు, స్థానిక సమస్యలపై నాయకులతో సమీక్ష నిర్వహించారు. అలాగే జనసేన పార్టీ నాయకులు, డివిజన్ ఇంచార్జిలు పాల్గొని పార్టీ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.రాబోయే రోజుల్లో ప్రజలకు మరింత చేరువ కావాలని, పార్టీ కార్యక్రమాలను గ్రామాలు, డివిజన్ల స్థాయిలో విస్తృతంగా నిర్వహించాలని నాయకులకు ఎంపీ బాలశౌరి సూచించారు.

## గ్యాస్ డెలివరీ బాయ్ కి రశీదు పైన ఉన్న డబ్బులు మాత్రమే చెల్లించండి

**- జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ**

**జి.కొండూరు(బ్యూరో చీఫ్) మే 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)**:గ్యాస్ సిలిండర్ ఇంటికి డెలివరీ చేయు సమయములో గ్యాస్ డెలివరీ బాయ్ కి రశీదు పైన ఉన్న డబ్బులు మాత్రమే వినియోగ దారులు చెల్లించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ వెల్లడించారు. ఎల్ పి జి గ్యాస్ బుక్ చేసిన వారు గ్యాస్ సిలిండర్ ఇంటికి తీసుకు వచ్చిన తరువాత మాత్రమే డెలివరీ బాయ్ కి ఓ.టి.పి చెప్పాలని సూచించారు.గ్యాస్ సిలిండర్ ఇంటికి రాక ముందే ఓ.టి.పి చెప్పకూడదని, గ్యాస్ సిలిండర్ ఇంటికి డెలివరీ అయిన తరువాత సంభందిత రశీదు తీసుకోవాలని తెలిపారు.గ్యాస్ డెలివరీ బాయ్ కి రశీదులో ఉన్న ధర కంటే ఎక్కువ డబ్బులు చెల్లించరాదనీ,గ్యాస్ డెలివరీ చేయు సమయములో డెలివరీ బాయ్ ప్రవర్తన సరిగా లేనియడల ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం నందలి కమాండ్ కంట్రోల్ రూమ్ నెం.9154970454 కి కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు అని జాయింట్ కలెక్టర్ తెలియజేశారు.అలాగే ఎల్ పి జి గ్యాస్ ఏజెన్సీ లు గ్యాస్ సిలిండర్ ను ఇంటి వద్దకే డెలివరీ చేయాలని, ఏజెన్సీ వద్ద డెలివరీ చేయరాదన్నా రు.ఏజెన్సీ కి వచ్చి సిలిండర్ తీసుకువెళ్ళమని ఏదైనా ఏజెన్సీ వినియోగదారున్ని ఇబ్బంది పెట్టినట్లయితే సదరు ఏజెన్సీ పై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఎల్ పి జి వినియోగదారులు అవసరంమేరకు మాత్రమే గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకోవాలని, అవసరం లేకుండా బుక్ చేసుకొని హోటల్స్, రెస్టారెంట్స్ వంటి కమర్షియల్ వ్యాపారానికి డైవర్ట్ చేస్తే సంబంధిత ఎల్ పి జి గృహ కనెక్షన్ రద్దు చేయబడుతుందని తెలియజేశారు.

## ఎస్బిఐ స్టాఫ్ ఫెడరేషన్ నేతలతో ఎంపీ బాలశౌరి.

**సిబ్బంది సమస్యలపై వినతి పత్రం సమర్పణ.**



**మచిలీపట్నం మే 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ ఫెడరేషన్ దేశవ్యాప్త ఆందోళన కార్యక్రమంలో భాగంగా ఫెడరేషన్ నేతలు శుక్రవారం మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బ్యాంకు సిబ్బంది ఎదుర్కొంటున్న పలు సమస్యలను వివరించి, వాటి పరిష్కారం కోసం సమగ్రమైన వినతి పత్రాన్ని ఎంపీకి అందజేశారు. తమ న్యాయపరమైన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఫెడరేషన్ ప్రతినిధులు కోరారు. వినతి పత్రాన్ని స్వీకరించిన ఎంపీ వల్లభనేని బాలశౌరి సానుకూలంగా స్పందిస్తూ, సిబ్బంది సమస్యలను సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రతినిధులు ఎల్. సుబ్రహ్మణ్యం, ఎస్. ఝాన్సీ, వాసుదేవ్, కె.డి. శ్రీచరణ్, బి. శశాంక్, వై. కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు

## బిజెపి అధ్యక్షునిగా నియామకమైన పివి కృష్ణారావుకు బీసీ సంఘ ఘన సత్కారం



**మార్కాపురం, మే 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)**:నూతనంగా ఏర్పడినటువంటి మార్కాపురం జిల్లాకు మొట్టమొదటి భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడిగా ఎంపికైనటు వంటి నిత్య సమాజ సేవకులు, గో సంరక్షకులు అయిన పీవీ కృష్ణారావును బీసీ భవన్ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగినటువంటి అభినందన సభలో కాపు సామాజిక వర్గానికి చెందినటు వంటి పీవీ కృష్ణారావు బీసీ భవన్ కమిటీ సభ్యులకు ఎంతగానో అభిమానధనుడని, బీసీ బాలికల వసతి గృహాన్ని సాధించడంలో తన వంతు పాత్రను పోషించారని, ఇప్పుడు ఉన్నటువంటి కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న పీవీ కృష్ణారావు అందరి సహకారాన్ని సాధించి త్వరలో బీసీ కమ్యూనిటీ హాల్ కూడా సాధించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పి ఎల్ పి యాదవ్ మనవి చేశారు. మార్కాపురం జిల్లా నూతన బిజెపి అధ్యక్షుడిగా తమ శ్రేయోభిలాషి నియామకం పొందిన సందర్భంలో వారిని పూలమాలతోనూ ఘనంగా సత్కరించిన వారిలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు రంగస్వామి గౌడ్ , మార్కాపురం పట్టణ గౌడ సంఘం అధ్యక్షులు నరసింహారావు గౌడ్, బీసీ ఉద్యోగుల విభాగం నాయకులు దేవశీర్ల బాలయ్య ఒడియ రాజు, కొమ ర వెంకటేశ్వర్లు గౌడ్ ,వంకేశ్వరం శ్రీనివాస్ నాయి బ్రాహ్మణ, సీనియర్ బిజెపి నాయకులు,ఎక్స్ ఆర్మీ అధికారి చిన్నయ్య ముదిరాజ్,తెలుగుదేశం పార్టీ మార్కాపురం మున్సిపల్ కౌన్సిలర్ నాలి కొండయ్య యాదవ్ న్యాయవాది పిన్నిక నాగార్జున ప్రసాద్ (పి ఎన్ పి) యాదవ్, శ్రీ వేణుతల కాటంరాజు గంగాభవాని దేవస్థాన కమిటీ ప్రధాన కార్యదర్శి బుర్రి చిన్న వెంకటేశ్వర్లు యాదవ్, మార్కాపురం జిల్లా యాదవ సంఘం నూతన అధ్యక్షులు బత్తుల పెద్ద అల్లూరయ్య యాదవ్ , వెలుగొండ యాదవ సత్ర కమిటీ సభ్యులు బోరి గొర్ల గాలయ్య యాదవ్, నాగం రామకృష్ణ వెంకటేశ్ యాదవ్ గుమ్మ రమేష్ యాదవ్, కనపర్తి బాల గోవింద్ యాదవ్ గుమ్మా రాఘవేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నిడమర్రు గ్రామ సమస్యలపై ప్రజాదర్బార్ లో అర్జీ ని సమర్పించిన డి.సి. వైస్ చైర్మన్ బొర్రా ఏడుకొండలు



**కృత్తివెన్ను మే 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కృత్తివెన్ను మండలం నిడమర్రు గ్రామ సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం పెడన ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజాదర్బార్ లో కృత్తివెన్ను మండలం డి సి వైస్ చైర్మన్ బొర్రా ఏడుకొండలు అర్జీ ని కలెక్టర్ డీకే బాలాజీ మరియు పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ కు సమర్పించారు. పెదచందాల నిడమర్రు ఛానల్ పంట కాలువకు రిటన్ వాల్ ( టఫ్ ) గోగులేరు వరకు నిర్మించాలని, సముద్రపు అటు,పోట్ల వలన పంట కాలవలోని మంచినీరు కలుషితమై ఉప్పుగా మారి నిరుపయోగంగా మారుతున్నాయని అందువలన పెద చందాల నిడమర్రు ఛానల్ పంట కాలువకు రిటర్న్ వాల్ కట్టడం వలన ఉప్పు నీరు పంట కాలువలో చేరకుండా గ్రామానికి మంచినీరు చేరుతుందని తగిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రం ఇచ్చారు. అలాగే నిడమర్రు మురుగు కాలువ మీద ఉన్న కల్వర్టర్( వంతెన) శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిందని నూతన కల్వర్టర్ నిర్మించాలని నిడమర్రు గ్రామంలోని అంగన్వాడీ భవనం శిథిలావస్థకు చేరిందని నూతన భవనాన్ని నిర్మించవలసిందిగా డిసి వైస్ చైర్మన్ బొర్రా ఏడుకొండలు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మరియు ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ కు వినతి పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో బస్వాని బంగార్రాజు దాసరి బాల యేసు జల్లా దానయ్య బస్వాని యేసు రాజు తమ్ము చెన్నకేశవులు ముప్వల జోషి తదితరులు పాల్గొన్నారు.

## రెడ్డిగూడెంలో విజయవంతంగా టిబి ముక్త భారత్ ఉచిత వైద్య శిబిరం

**ప్రజలతో మమేకమైన ప్రజల సేవకుడు ముప్పిడి నాగేశ్వర రెడ్డి**




**రెడ్డిగూడెం మే 15(వార్తాప్రభ ప్రతినిధి )**:ప్రజల ఆరోగ్య రక్షణే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న "టిబి ముక్త భారత్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా రెడ్డిగూడెం హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన ఉచిత వైద్య పరీక్షల శిబిరానికి గ్రామ ప్రజల నుండి విశేష స్పందన లభించింది.ఈ కార్యక్రమంలో ప్రజల సేవకుడు ముప్పిడి నాగేశ్వర రెడ్డి పాల్గొని ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. టిబి ముక్త భారత్ కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించి, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. వ్యాధి వచ్చిన తర్వాత బాధపడటంకంటే ముందుగానే పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక సమస్యలను నివారించవచ్చని తెలిపారు.శిబిరానికి వచ్చిన ప్రజలకు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకంగా మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అందరి ప్రశంసలు అందుకుంది. వైద్య పరీక్షల కోసం వచ్చిన మహిళలు, వృద్ధులు, రైతులు, యువతతో నాగేశ్వర రెడ్డి మమేకమై వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.అదేవిధంగా శిబిరంలో ఏర్పాటు చేసిన ఎదీ పరీక్షల విభాగం, డిజిటల్ ఎక్స్రే కేంద్రాన్ని సందర్శించి పరీక్షలు ఎలా నిర్వహిస్తున్నారో స్వయంగా పరిశీలించారు. వైద్య సిబ్బందితో మాట్లాడి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.ఈ శిబిరంలో ఎదీ పరీక్షలతో పాటు బిపి, షుగర్, హీమోగ్లోబిన్ తదితర ఆరోగ్య పరీక్షలు ఉచితంగా నిర్వహించగా పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని సేవలను వినియోగించుకున్నారు.

**"ఆరోగ్యమే మహాభాగ్యం...**ముందస్తు పరీక్షలే సంపూర్ణ రక్షణ" అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమం గ్రామ ప్రజల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంచిందని పలువురు అభిప్రాయపడ్డారు.

## పట్టణంలో వ్యాపార ఆక్రమణలు తొలగించేవిధంగా ఆదేశాలివ్వండి.

**కలెక్టర్ ను కోరిన పట్టణ వాసులు**



**పెడన మే 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పెడన నియోజక వర్గ వ్యాప్తంగా ప్రత్యేకించి లిప్రజా సమస్యల పరిష్కార వేదికలో తన బాధ్యతగా హాజరైన పెడన నియోజకవర్గ శాసన సభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ని పట్టణ వాసులు కోరారు. పెడన పట్టణంలో వ్యాపార ఆక్రమణలు సత్వరమే తొలగించి బందరు లాంటి ప్రాంతాల్లో చేస్తున్న తొలగింపులు మాదిరిగానే ఇక్కడ కూడా తక్షణమే చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కి శాసన సభ్యులు కి పట్టణ అర్జీ అందజేశారు.కలెక్టర్ వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేయడం జరిగింది అనంతరం రెండు మూడు వార్డుల ప్రజల తరపున దీర్ఘ కాలిక సమస్య రిసర్వే నెంబర్ 594/1 రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కారం చేసినందుకు శాసన సభ్యులు కలెక్టర్ కి స్థానిక నివాసితులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కలంకారీ దుశ్శాలువతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు శ్రీనివాస్ వీణం ఆకురాతి జనార్ధన రావు కొలుకుల శ్యామసుందర రావు రమేష్ సింగరాజు ప్రకాశ రావు శ్రీనివాస రావు కొమ్మూరి సాంబ శివరావు తమ్మన శంకర్ గురజాడ రమణగారు కొసనం నాగేశ్వర రావు ,నల్ల సాయిబాబు గారు,అలుగూరు అజయ్ తదితరులు ప్రజలు పాల్గొన్నారు.

**మాజీ సి.యం. జగన్ మోహన్ రెడ్డి ని కలిసిన వేల్పుల దంపతులు.**



**పెనుగంచిప్రోలు, మే 15( వార్త ప్రభ )** తాడేపల్లి లోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో తన విదేశీ పర్యటనను ముగించుకొని స్వదేశానికి విచ్చేసిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ని కలిసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి,నెడ్ క్యాప్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వేల్పుల రవికుమార్, వారి సతీమణి పెనుగంచిప్రోలు మాజీ సర్పంచ్ వేల్పుల పద్మ కుమారి దంపతులు శుభాకాంక్షలు తెలిపారు.

## శ్రీ తిరుపతమ్మ ను దర్శించు కున్న నందిగామ ఆర్డివో



**పెనుగంచిప్రోలు, మే 15( వార్త ప్రభ )** శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ని నందిగామ ఆర్డీవో అనిల్ కుమార్ శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి, అర్చకులు వేద పండితులచే వేద ఆశీర్వచనం చేసి, అమ్మవారి శేష వస్త్రములు, తీర్థప్రసాదములు అందజేసారు.

# మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యం

## చెత్త దుర్గంధంతో ఇబ్బంది పడుతున్న స్థానికులు



**జగ్గయ్యపేట మే 15 (వార్తప్రభ)** పట్టణంలోని సీతారాంపురం ఎ ఎస్ ఆర్ అపార్ట్మెంట్ వెనక భాగంలో మున్సిపల్ సిబ్బంది చెత్త సేకరించడం లేదని, వీధులు శుభ్రం చేయడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు మాట్లాడుతూ గత నెల రోజులుగా వీధులు శుభ్రం చేయడం లేదని, చెత్త సేకరించకపోవడం వల్ల దుర్గంధం వెదజల్లుతూ గాలి వచ్చినప్పుడు రోడ్డు పై చెత్త ఇళ్లలోకి వస్తుందని దీనివల్ల ఇబ్బందిలకు గురి అవుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్, అధికారులు, సిబ్బంది స్పందించి తమ సమస్య తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

**అయ్యప్ప నగర్ లో కూడా ఇదే పరిస్థితి** పట్టణంలోని అయ్యప్ప నగర్ లో కూడా మున్సిపాలిటీ వారు చెత్త సేకరించడం లేదని, వీధులు డ్రైనేజీలు శుభ్రం చేయడం లేదని, అపరిశుభ్ర వాతావరణ వల్ల అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉందని తమ సమస్యలు తీర్చాలని అయ్యప్ప నగర్ వాసులు కోరుతున్నారు. మరియు కొందరు డ్రైనేజీకి అడ్డుగా చెత్తాచెదారం వేయడం వల్ల డ్రైనేజీలు నేటితో నిల్వ ఉండి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయని డ్రైనేజీలు వెంటనే శుభ్రం చేయాలని వారు కోరుతున్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం.



**మోపిదేవి: అవనిగడ్డ:మే 15(వార్తాప్రభ ప్రతినిధి)**మోపిదేవి మండలం కప్తాను పాలెం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందారు. ద్విచక్ర వాహనం పై చల్లపల్లి వైపు వస్తుండగా మార్గమధ్యంలో కప్తానుపాలెం వద్ద ప్రమాదం జరిగింది.ప్రమాదం లో మృతి చెందిన వ్యక్తి ఘంటసాల మండలం జిలగలగండి గ్రామానికి చెందిన కొప్పుల అరవింద్ ( 25)గా గుర్తించారు.సమాచారం తెలుసుకున్న ఎస్ఐ గౌతమ్ కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# శ్రీపృథ్వీశ్వరస్వామికి లక్ష మల్లెలతో పుష్పార్చన.



**చల్లపల్లి: అవనిగడ్డ:మే15(వార్తాప్రభ ప్రతినిధి)**మాస శివరాత్రి సందర్భంగా చల్లపల్లి మండలంలోని మహిమాన్విత ప్రాచీన శైవక్షేత్రం నడకుదురు శ్రీపృథ్వీశ్వరస్వామి వారి ఆలయంలో శుక్రవారం స్వామివారికి శత సహస్ర మల్లెల (లక్ష మల్లెలు)తో పుష్పార్చన, అమ్మవారికి పాటలి కుసుమాలతో సహస్ర నామార్చన పూజలు అత్యంత వైభవం గా జరిగాయి. తొలుత శ్రీపృథ్వీశ్వరస్వామికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం చేశారు.అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని పుష్పార్చన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి మల్లెలతో విశేష అలంకరణలు చేశారు. అర్చకులు కంఠంరాజు వెంకట శివ సుబ్బారావు, కంఠంరాజు పృధ్వీకుమార్ శర్మ, కంఠంరాజు వారి వంశ పారంపర్య అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

# ధైర్యమే దారి!!




పరిస్థితులకు బెదరకూ
పట్టుదలతో ముందడుగేయ్
సమస్యలు వచ్చినప్పుడే
సత్తా బయటపడుతుంది
చీకటి ఎంత కమ్ముకున్నా
వెలుగు దారి చూపుతుంది
ఓటమిని కాదు సఖీ
అవకాశాన్ని ఆలోచించు
గాలి ఎదిరించినప్పుడే
పతంగి ఎగురుతుంది
గట్టెక్కే మార్గం కోసం
ధైర్యంగా ప్రయత్నించు
కాలం మారిన క్షణంలో
కష్టం కూడా కరిగిపోతుంది

**గడ్డం సంతోష్ కుమార్**
9849555485, గోదావరిఖని

# అంధకార స్థితిలోకి ప్రజలను నెట్టివేసిన బీజేపి ప్రభుత్వం

- పెట్రో ధరల పెంపుపై ఐ.ఎఫ్.టి.యు. జాతీయ కార్యదర్శి షేక్ షావలి
- పెంచిన ధరలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్.



**జవహర్ నగర్, మే 15:(వార్తా ప్రభ)**కేంద్రంలోని ఎన్.డి.ఏ. బీజేపీ నరేంద్రమోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చిన పెట్రో పెంపు ధరలను వెంటనే రద్దు చేయాలని ఐ.ఎఫ్.టి.యు. జాతీయ కార్యదర్శి షేక్ షావలి డిమాండ్ చేశారు. 2026, మే-15 వ తేదీన జారీచేసిన పత్రిక ప్రకటనలో 147 కోట్లమంది భారతదేశ ప్రజలను అంధకారంలోకి నెట్టివేసే పెట్రోల్, డీజిల్ ధరల పెంపు దుర్మార్గమైన, అమానుష ప్రజా వ్యతిరేక మైన చర్య అని ఎండగట్టారు. పశ్చిమాశియా దేశాలలో జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో ఏర్పడిన సంక్షోభం వలన ఆయిల్ కంపెనీలు చేపట్టిన నిర్ణయంలో బాగమే పెట్రో ధరల పెంపు అని తీవ్రంగా ఖండించారు. అంతర్జాతీయ స్థాయిలో ఈరోజు ఆయిల్ చమురు సంక్షోభంలో పడడానికి అమెరికా డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ నేతాన్యాహు తోపాటు భారత ప్రదాని నరేంద్రమోదీ కూడ ఒకరని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అమెరికా సామ్రాజ్యావాదానికి లొంగిపోయిన నరేంద్రమోదీ, దేశాన్ని మరో నయా వలస దేశంగా మార్చి, అన్నిరకాల అమెరికా దోపిడీకి సంభందించిన ఒప్పందాలు చేసుకొన్నాడని మండిపడ్డారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు అయిన వెంటనే ఇలాంటి అప్రజాస్వామిక చర్యలు, విధానాలతో దేశ ప్రజలను ఇంకా త్యాగాలకు సిద్ధపడాలని చెప్పడం ఇంతకన్న సిగ్గుచేటు మరొకటి ఉండదని అన్నారు. అన్నిరంగాలు తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోయి, అప్పుల దేశంగా మార్చేసి, అగమ్యగోచరంలోకి వివిధ శ్రామిక, మధ్యతరగతి ప్రజలను, ఉద్యోగస్థులను నెట్టివేసిందని అన్నారు. ఇప్పటికే ఏఐ వలన అనేక సాఫ్ట్వేర్ కంపెనీలలో పనిచేస్తున్న ఉద్యగులను ఇంటికి పింపిస్తున్నారని, ఇంకా కొందరి ఉద్యోగస్తులకు వారి ఉద్యోగ భద్రతా గాలిలో దీపంలా ఊగిసలాడుతున్నారని అన్నారు. మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా ఆత్మహత్యలు, అర్ధకాలి, పస్థులు, చాలిచాలని విద్య, ఉద్యోగం, ఉపాధి సౌకర్యాలు, వేతనాలు లేక తల్లడిల్లుతున్న ప్రజానీకంపై పెట్రో ధరల పెంపు మోయలేని పెనుబారం అని అన్నారు. ఇప్పటికే పెరిగిన నిత్యవసర ధరలతో ప్రజలు అల్లాడి పోతున్నారని అన్నారు. దీనికి తోడు పెట్రో ధరలతో ఇతర వస్తువుల ధరలు అమాంతం పెరిగి, ప్రజల కొనుగోలు శక్తిని దెబ్బతీస్తాయని గుర్తుచేశారు. వెంటనే దేశంలోని బీజేపీయేతర ప్రభుత్వాలు, ప్రజలు పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను బలంగా తిరస్కరించాలని కోరారు.

# సప్తగిరి కాలనీలో సేవా స్ఫూర్తి చాటిన చలివేంద్రం

## ప్రజలకు మజ్జిగ, పండ్లు, మంచినీరు పంపిణీ చేసిన ఎంసీఆర్ కాంప్లెక్స్ కమిటీ సభ్యులు




**కూకట్ పల్లి, మే 15(వార్తాప్రభ):**కూకట్‌పల్లి నియోజకవర్గంలో వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని, సప్తగిరి కాలనీ రామాలయం దేవాలయం ముందు ఉన్న ఎంసీఆర్ కాంప్లెక్స్ వద్ద వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన చలివేంద్రం ప్రజలను ఆకట్టుకుంది. ఎంసీఆర్ కాంప్లెక్స్ అధ్యక్షులు అభిలాష్ రెడ్డి, స్వాతి దంపతుల ఆధ్వర్యంలో ఈ చలివేంద్రంలో ప్రజలకు చల్లని మంచినీరు, మజ్జిగతో పాటు పండ్లను పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి హాజరై చలివేంద్రం వద్దకు వచ్చిన ప్రజలకు స్వయంగా మజ్జిగ, పండ్లు, మంచినీరు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు సేవా భావంతో ముందుకు వచ్చిన అభిలాష్ రెడ్డి -- స్వాతి దంపతులను ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి సంవత్సరం ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జె. పురేందర్ రెడ్డి, కమిటీ సభ్యులు జి. ప్రసాద్, లక్ష్మీనారాయణ, కొండా రెడ్డి, వైవి రావు, నర్సింగ్ రావు, సూర్యనారాయణ తదితరులు మజ్జిగ, పండ్ల పంపిణీలో చురుకుగా పాల్గొన్నారు. అలాగే ఎంసీఆర్ కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, జయలక్ష్మి, స్వాతి, శివప్రసాద్, రవి రెడ్డి, సురేష్ బాబు, శ్రావణి తదితరులు సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి కమిటీ సభ్యుడిని జై పురేందర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. వేసవి వేళ ప్రజలకు ఉపశమనం కలిగించే విధంగా నిర్వహించిన ఈ చలివేంద్రం స్థానిక ప్రజల ప్రశంసలను అందుకుంది.

# మాజీ సర్వేయర్ దళిత బిడ్డ "సబ్బతి " మృతి



**పెనుగంచిప్రోలు, మే 15( వార్త ప్రభ )** పెనుగంచిప్రోలు మండల మాజీ సర్వేయర్, దళిత బిడ్డ సబ్బతి సత్యనారాయణ (70) గురువారం మృతి చెందారు. ఈయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం అమలాపురంలోని తన స్వగ్రామంలో మృతి చెందారు. వీరి మృతి పట్ల పెనుగంచిప్రోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతల సీతారామయ్య, దేవస్థానం మాజీ చైర్మన్లు నూతలపాటి చెన్నకేశవ రావు, కాకాని శ్రీనివాసరావు, వాసిరెడ్డి బెనర్జీ, మాజీ జెడ్పిటిసి గజ్జి కృష్ణమూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు కర్ల వెంకట్ నారాయణ,పెనుగంచిప్రోలు మండల ప్రెస్ క్లబ్ కార్యదర్శి బోళ్ల రవికుమార్ సంతాపం వ్యక్తం చేస్తూ వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ సంతాపం వ్యక్తం చేశారు..

# జన గణన కార్యక్రమాన్నీ పర్య వేక్షించిన ఎంపిడిఓ



**పెనుగంచిప్రోలు, మే 15( వార్త ప్రభ )** పెనుగంచిప్రోలు మండల పరిధిలో జరుగుతున్న జనగణన కార్యక్రమాన్ని మండల అభివృద్ధి అధికారి శ్రీమతి జి. శ్రీను స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పెనుగంచిప్రోలు గ్రామంలో నిర్వహిస్తున్న జన గణన ప్రక్రియను పరిశీలించి, సంబంధిత సిబ్బందికి అవసరమైన సూచనలు మరియు మార్గదర్శకాలుఅందించారు.జనగణన కార్యక్రమాన్ని ఖచ్చితంగా మరియు సమయానికి పూర్తి చేయాలని, ప్రతి ఇంటిని సందర్శించి పూర్తి వివరాలను సేకరించాలని అధికారులకు ఆదేశించారు. గ్రామ ప్రజలు కూడా ఈ కార్యక్రమానికి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ అంతరాయం

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మే 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సుజాతనగర్, విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు ఒక ప్రకటన తెలిపారు కొత్తగూడెం కార్పొరేషన్ మండలంలోని అన్ని గ్రామాలవిద్యుత్ వినియోగదారులకు శనివారం అనగా 16 5 2026న సుజాతనగర్ విద్యుత్ సబ్ స్టేషన్ నందు మరమ్మత్తులు ఉంటుందని మండలంలోని విద్యుత్తు ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు సరఫరా నిలిపివేయబడునని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ వారు తెలిపారు

# ఘనంగా యాదవ నేత బోడ్డు రమేష్ జన్మదిన వేడుక





**విజయవాడ, మే 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)** అఖిలభారత యాదవ మహా సంఘం రాష్ట్ర సెక్రటరీ జనరల్ బొడ్డు రమేష్ యాదవ్ పుట్టినరోజు వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా వారి నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహా సంఘం పొలిటికల్ అఫైర్స్ కమిటీ చైర్మన్ గోరిపర్తి శ్రీనివాస్ యాదవ్, అఖిల భారత యాదవ మహా సంఘం రాష్ట్ర కోశాధికారి ఢిల్లీ భూపతి యాదవ్, అఖిల భారత యాదవ మహా సంఘ నాయకులు ముసి బోయిన సుబ్బారావు,అఖిల భారత యాదవ మహా సంఘం కార్య నిర్వాహక కార్యదర్శి వీర్ల నాని తదితరులు పాల్గొని రమేష్ చే కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా పలువురు అభిమానులు, ఆత్మీయులు బొడ్డు రమేష్ యాదవ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# ఘనంగా ఎమ్మెల్యే గిడ్డి పుట్టినరోజు.



**అయినవిల్లి: మే 15 :(వార్తా ప్రభ ప్రతినిధి):**పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పుట్టినరోజు వేడుకలు కూటమి నాయకులు ఘనంగా నిర్వహించారు.మండలంలోని విలస గ్రామంలోని న్యూలైఫ్ సెంటర్ లో కేక్ కట్ చేసి పరస్పరం తినిపించుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.ఈ సందర్భంగా న్యులైఫ్ సెంటర్ లో చికిత్స పొందుతున్న రోగులకు బ్రెడ్లు,కూల్ డ్రింక్స్, ఆపిల్స్, ద్రాక్ష పళ్ళు పంపిణీ చేసారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆరోగ్యం గా ఉండాలని నియోజకవర్గాన్ని అభివృద్ధి పదంలో నడిపించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాకర బాబ్జి,లీగల్ సెల్ అధ్యక్షుడు బడుగు భాస్కర్ జోగేష్, ఎస్సీ సెల్ నాయకుడు మోర్త వెంకటేశ్వరరావు,మోర్త సత్తిబాబు,డిసి కాకర శ్రీను,చోడే లోవ రాజు, కుసుమ బహుగుణ ,నామాడి దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రాఘవేంద్ర కాలనీలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

## అవగాహన కల్పించిన అధికారులు




**కుత్బుల్లాపూర్, మే 15, (వార్తాప్రభ):** ఇటీవల 'మన నగరం' కార్యక్రమంలో భాగంగా ఉత్తమ కాలనీ అవార్డును అందుకున్న హెచ్.ఏ.ఎల్ రాఘవేంద్ర కాలనీ లో గురువారం జిహెచ్ఎంసి ఎంటమాలజీ అధికారులు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణపై కాలనీ వాసులకు విస్తృత అవగాహన కల్పించారు.

**ఇంటింటికి వెళ్లి తనిఖీలు** ఎంటమాలజీ అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి నిల్వ ఉన్న నీటిని పరిశీలించారు. దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. అనంతరం కాలనీలోని మురుగు కాలువలు, ఖాళీ ప్రదేశాల్లో దోమల నివారణ మందులను పిచికారీ (స్ప్రే) చేయించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉండగలమని ఈ సందర్భంగా అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ అధికారిణి పద్మ, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కుంట సిద్ధిరాములు, గౌరవ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ దిడ్డి మల్లేశం, ఉపాధ్యక్షులు రాములు, జి. శ్రీనివాస్ రెడ్డి, ఆలయ చైర్మన్ టి. రాజేశ్వర్, ఆర్థిక కార్యదర్శి సి.హెచ్. రాజు, బాలరాజు, శ్రీనివాస్ రెడ్డి, సుబ్బయ్య పాల్గొన్నారు. అలాగే వివిధ కాలనీల నాయకులు సంపత్, మాధవ రెడ్డి, బచ్చ జ్ఞానేశ్వర్, నరేందర్ రెడ్డి, అప్పల శేఖర్, నర్లకంటి కుమార్, ఎల్లగౌడ్ మరియు కాలనీ పెద్దలు, సిబ్బంది ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

# అంబేద్కర్ విగ్రహం వద్ద బిఆర్ఎస్ ధర్నా.

## గొర్రె అరుణారెడ్డి, కుంట సిద్ధిరాములు తదితరుల అరెస్ట్





**హైదరాబాద్, మే, 15, (వార్తాప్రభ) :** సచివాలయం సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ ధర్నా నిర్వహించారు.

**సచివాలయం వద్ద ఉద్రిక్తత** కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన మహిళా బిఆర్ఎస్ నాయకురాలు గొర్రె అరుణారెడ్డి, మస్కూరి పద్మ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున అంబేద్కర్ విగ్రహం ఎదుట బైఠాయించారు. చట్టం అందరికీ సమానమేనని, తప్పు చేసిన వారు ఎంతటి వారైనా చర్యలు తీసుకోవాలని వారు నినాదాలు చేశారు. ఈ క్రమంలో అక్కడ కొంత సమయం ఉద్రిక్తత చోటుచేసుకుంది.

**పోలీసుల అరెస్ట్ – నాంపల్లి స్టేషన్‌కు తరలింపు** అనుమతి లేకుండా ధర్నా నిర్వహిస్తున్నారన్న కారణంతో పోలీసులు నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో గొర్రె అరుణారెడ్డి, మస్కూరి పద్మలతో పాటు బిఆర్ఎస్ నాయకులు కుంట సిద్ధిరాములు, బచ్చ జ్ఞానేశ్వర్, పోగు సమ్మన్న, నేత మధు, కృష్ణ, నదీమ్, రాయ్ బలరాం, కృష్ణ మురళి తదితరులు ఉన్నారు. అరెస్ట్ చేసిన నాయకులను నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించి, వారిపై కేసులు నమోదు చేశారు. అనంతరం పోలీసులు వారిని సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

# చంద్రగూడెంలో 'కిశోరి వికాసం'



**మైలవరం మే 15 :(వార్తా ప్రభ ప్రతినిధి):**ఐసిడిఎస్ మైలవరం ప్రాజెక్ట్ పుల్లూరు సెక్టార్ పరిధిలోని చంద్ర గూడెం గ్రామపంచాయితీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం అన్ని అంగన్వాడీ సెంటర్ల అంగన్వాడీ కార్యకర్తలు కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. థీమ్ పోక్సో చట్టం పై బాలికలకు అవగాహన కల్పించారు.18 ఏళ్ల లోపు పిల్లలను లైంగికంగా వేధించడం,దాడులు నుంచి రక్షించడానికి రూపొందించబడిన ఒక సమగ్ర భారతీయ చట్టం పోక్సో అని తెలిపారు.ఈ చట్టం బాల బాలిక అందరికీ వర్తిస్తుందనీ,ఈ నేరానికి పాల్పడిన వారికి కోర్టు కఠినమైన జైలు శిక్షలు,జరిమానాలు విధిస్తుందని బాలికలకు వివరించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఉషశ్రీ, పద్మావతి, నాగేశ్వరమ్మ, మంజుల,రాజ్యలక్ష్మి, లక్ష్మి, కిశోర బాలికలు పాల్గొన్నారు.

# సాంకేతికత పునాదిపై వికసిత భారతం

● మై భారత్ కేంద్ర కృష్ణాజిల్లా ఆధ్వర్యంలో నేషనల్ టెక్ డే..




**గుడివాడ,మే 15 (వార్తాప్రభ) :** వద్దాది చారిటబుల్ ట్రస్ట్ ఆఫీసు నందు మై భారత్ కేంద్రం కృష్ణాజిల్లా ఆధ్వర్యంలో నేషనల్ టెక్ డే ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న సప్తగిరి గ్రామీణ బ్యాంక్ సీనియర్ మేనేజర్ ఎం సైదమ్మ మాట్లాడుతూ మాజీ భారత దేశ ప్రధాని రాజీవ్ గాంధీ మొట్టమొదటిసారిగా ఐటి రంగాన్ని భారతదేశాన్ని తీసుకొచ్చిన తొలి ప్రధాని 1998లో పోక్రంలో జరిగిన అను పరీక్షల విజయాన్ని గుర్తు చేసుకుంటూ భారతదేశ శాస్త్ర సాంకేతిక శక్తిని ప్రపంచానికి చాటిన రోజున ఈరోజు భారతదేశంలో ప్రపంచ దేశాలతో పోటీపడుతుందని రాబోయే కాలంలో విద్యార్థులు ఏఐ టెక్నాలజీ అభివృద్ధి చెందుతుందని దీనికి ప్రతి ఒక్క విద్యార్థి ఉపయోగించుకుని ఉపాధి పొందాలని అన్నారు. ఈ కార్యక్రమం లో ఐటి నిపుణులు పులప చంద్రశేఖర్, ఇంగ్లీషు లెక్చరర్ దగాని నిచ్చల, ఎస్ ఐ ఆర్ గుడివాడ ఇన్చార్జి యర్రపోతు అర్జున్ మరియు వద్దాది చారిటబుల్ ట్రస్టు అధినేత వద్దాది రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎండ నుంచి ఉపశమనం.. బాటసారులకు మజ్జిగ పంపిణీ..



**గుడివాడ,మే 15 (వార్తాప్రభ) :** శుక్రవారం శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి హరికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో కీ॥ శే॥ మారెడ్డి వెంకటేశ్వరరెడ్డి జ్ఞాపకార్థంగా వారి కుమారుడు మారెడ్డి పవన్ కుమార్ రెడ్డి మరియు కుటుంబ సభ్యుల సహకారం అలాగే దేసు వెంకట సుబ్బారావు జ్ఞాపకార్థం వారి భార్య దేసు నాగలక్ష్మి కుటుంబ సభ్యుల సహకారంతో స్థానిక ఏలూరు రోడ్ లోని శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం కార్యాలయం దగ్గర మజ్జిగ పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భీమేశ్వర స్వామి వారి దేవాలయం, శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కందుల వేణుగోపాలరావు, శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం చైర్మన్ లింగం చిట్టిబాబు లు విచ్చేసి మజ్జిగ పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శివ ఇంటీరియర్స్ అధినేత మెరుగుమాల శివ నాగ ప్రసాద్, జాజుల మునీంద్ర, బొగ్గరపు తిరుపతయ్య, జాజుల తాతారావు, పుట్టి వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, ఫేమస్ టైలర్ బత్తుల ప్రసాద్, అత్తులూరి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## వెలమ సంఘం ఆధ్వర్యంలోనేటి నుంచి ఉచిత మజ్జిగ పంపిణీ

● 40 రోజులపాటు ఉచిత మజ్జిగ పంపిణీ..




**గుడివాడ,మే 15 (వార్తాప్రభ) :** స్థానిక ఎస్ పి ఎస్ కాంప్లెక్స్ అరుణ ఫ్యాన్సీ ఎదురుగా వెలమ సంఘం గుడివాడ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది ఈ చలివేంద్రాన్ని యూనియన్ బ్యాంక్ మేనేజర్ మూడేడ్ల దుర్గాప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెలమ సంఘం పెద్దలు మాట్లాడుతూ వెలమ సంఘం ఆధ్వర్యంలో గడిచిన పది సంవత్సరాలుగా ఇదే ప్రాంతంలో వేసవికాలం పాదచారుల దాహార్తిని తీర్చేందుకు ఉచిత మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ రోజు మొదలుకొని 40 రోజులు పాటు సంఘ సభ్యుల సహకారంతో ఇదే ప్రాంతంలో చలివేంద్రాన్ని కొనసాగించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు పంచకర్ల వెంకట్, గులిపల్లి ప్రభాకర్, కృష్ణ, మోకల సత్యనారాయణ, గేదల రమేష్, సబ్బాని రంగారావు, వర్రె శ్రీనివాసరావు, వంగపండు బ్రహ్మాజీ, బాబు, రొంపెల్ల వెంగళరావు, రెడ్డి షణ్ముఖం, టి శ్రీను, వెలమల పవన్ కుమార్, మూడెడ్ల శ్రీధర్, ఉమా, కె.సూర్యనారాయణ, పందిరేపల్లి హారిక, షేక్ రమీజా మరియు వెలమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాన ట్రస్ట్ కు 10 లక్షల రూపాయలు విరాళం ప్రకటించిన దీపక్ నెక్స్ జెన్



**హనుమాన్ జంక్షన్,మే 15 (వార్తాప్రభ) :** హనుమాన్ జంక్షన్ లోని శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన ట్రస్ట్ కు కృష్ణాజిల్లా బాపులపాడు మండలం బొమ్ములూరు దీపక్ నెక్సజెన్ ఫీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం 10 లక్షల రూపాయలు భారీ విరాళం ప్రకటించారు. కుమారుడు,నెక్స్ జెన్ డైరెక్టర్ అడుసుమిల్లి చైతన్య వాసు తో కలిసి స్వామి వారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు ఘనస్వాగతం పలికి,పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం పేదల కోసం,భక్తుల కోసం నిర్వహించే అన్నదాన కార్యక్రమం శ్రీ అభయ ఆంజనేయ అన్నదాన ట్రస్ట్ గురించి దేవాలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు వేమూరి శ్రీనివాసరావు,దేవాలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పితాని తారకేశ్వరరావు, ఆయనకు వివరించారు. స్పందించిన ఆయన 10 లక్షల రూపాయల విరాళం ప్రకటించారు.

# పెడనలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

### -పాల్గొన్న కలెక్టర్ ఎం ఎల్ ఎ వెల్లువెత్తిన అర్జీదారులు






**పెడన,మే 15 (వార్తాప్రభ) :** జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పి జి ఆర్ ఎస్ నోడల్ అధికారి పోతురాజు మచిలీపట్నం ఆర్డిఓ సాంబశివరావు, డిఎస్పి శ్రీనివాసరావులతో కలిసి శుక్రవారం ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక... మీకోసం కార్యక్రమం నిర్వహించారు.వివిధ ప్రాంతాల ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఇటీవల నిర్వహించిన జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆదేశాలు జారీ చేసిన మేరకు తొలిసారిగా అధికారికంగా నియోజకవర్గాల వారీగా సంబంధిత శాసనసభ్యులతో కలసి మీకోసం కార్యక్రమం నిర్వహణకు జిల్లా యంత్రాంగం శ్రీకారం చుట్టింది. జిల్లా కలెక్టర్ అర్జీదారుల సమస్యలను ఎంతో ఓపికగా ఆలకించి సంబంధిత అధికారులను పిలిపించి వివరాలు అడిగి తెలుసుకుని అర్జీదారులకు సామరస్యంగా అర్థమయ్యేలా వివరించారు. కృత్తివెన్ను మండలం మాట్లం గ్రామానికి చెందిన గ్రామ కాపురస్తులు మల్లేశ్వరం ఏఎంసీ చైర్మన్ వడుగు తులసిరావు మాట్లాడుతూ తాము అగ్నికుల క్షత్రియులమని తమ గ్రామంలో 7 వేల మంది జనాభా ఉన్నామని గ్రామంలో మంచినీటి సమస్య వలన ప్రస్తుతం ఉన్న ఊర చెరువు పక్కనే సుమారు 4 సెంట్లు స్థలంలో చెరువు ఏర్పాటు చేసుకుంటున్నామని గ్రామంలో ప్రస్తుతం ఉన్న చెరువు సుమారు 3.49 ఎకరాల్లో ఉందని ఈ మొత్తం ఏకచెరువుగా చేసుకునేందుకు శాసనసభ్యులు పార్లమెంటు సభ్యులు సి ఎస్ ఆర్ నిధులు ఎల్ఐసి నిధులు 1.50 కోట్ల రూపాయలు గ్రాంట్ మంజూరు కోసం దరఖాస్తు చేశామని చెరువు త్రవ్వటకు అనుకూలంగా గ్రాంట్ మంజూరు చేయాలని కోరుతూ అర్జీ అందజేశారు. పెడన మండలం బల్లిపర్రు గ్రామపంచాయతీ పరిధిలోని సింగరాయపాలెం గ్రామ పరిధిలో అంగన్వాడీ కేంద్రం వద్దగల కాలనీవాసులు 2008-09సంవత్సరంలో ప్రభుత్వం తమ కాలనీ కేటాయించిందని, అప్పటి నుండి ఇప్పటివరకు రహదారులు వేయలేదని, వర్షం వస్తే కాలనీలో మోకాలిలోతు నీళ్లు నిలిచి చిన్నపిల్లలు వృద్ధులు, గర్భవతులు నడవడానికి చాలా ఇబ్బంది పడవలసి వస్తుందని, విష సర్పాలు సంచరిస్తున్నాయని, తమకు న్యాయం చేసి రహదారి ఏర్పాటు చేయాలని కోరుతూ కాలనీవాసి బెజవాడ ప్రసాద్ అర్జీ అందజేశారు. కృత్తివెన్ను మండలం వైస్ డి.సి. బుర్రా ఏడుకొండలు మాట్లాడుతూ గరిసపూడి సచివాలయం నుండి నిడమర్రు గోగిలేరు వరకు నిడమర్రు పంట కాలువకు రక్షణ గోడ కట్టవలసినదిగా కోరుతూ అర్జీ అందజేశారు. అలాగే నిడమర్రు పంచాయతీలోని 10,000 మందికి మంచినీటి పథకం చెరువుకు ఉప్పునీరు రావడం వల్ల చెరువు దెబ్బతింటుందని అలా జరగకుండా చూడాలని కోరారు. నిడమర్రు అంగన్వాడి కేంద్ర భవనం శిథిలావస్థలో ఉండటంతో ప్రైవేటు గదిలో నడుపుతున్నారని నూతన భవనం నిర్మించాలని కోరారు. గరిసిపూడి నుండి నిడమర్రు వెళ్లే మార్గంలో మురుగు కాలువపై కల్వర్టు ఉండటం చేత ప్రజల రాకపోకలకు చాలా ఇబ్బందిగా ఉందన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఇప్పటి నుండి ప్రతి శుక్రవారం ఒక్క నియోజకవర్గం తీసుకొని ఒక నెలలో వరుసగా నాలుగు వారాలు కూడా అదే నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని (పీజీఆర్ఎస్) నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. అందులో భాగంగా కృష్ణా జిల్లాలో మొట్టమొదటి కార్యక్రమం పెడన నియోజకవర్గంలో ప్రధాన కేంద్రమైన పెడనల్లో ఏర్పాటు చేయడం చేయడం జరిగిందన్నారు. . ఇలాగే వచ్చే నాలుగు. శుక్రవారాలు కూడాను పెడనకే వస్తామన్నారు. వచ్చిన ఫిర్యాదులు అర్జీలు నాలుగు వారాల్లోపు పరిశీలించి చట్టరీత్యా ఎంతవరకు చేయగలము అంతవరకు చేయాలన్నదే ముఖ్య ఉద్దేశం అన్నారు. ఒకవేళ చేయలేకపోతే ఎందుకు చేయలేమో సంబంధిత అర్జీదారునికి వాస్తవ విషయాలు అర్థమయ్యేలా వివరించి ముగిస్తామన్నారు. పెడన శాసనసభ్యులు కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గంలో కూడా నాయకులు ఎవరైతే ఉంటారో అక్కడ ఉన్నటువంటి శాసనసభ్యులు అంతా కూడా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని ప్రతి శుక్రవారం కూడా నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగానే ఈరోజు నుంచి ప్రతి శుక్రవారం కలెక్టర్ తో పాటు మిగతా అధికారులందరూ కూడా కలిసి గ్రీవెన్స్ కార్యక్రమాన్ని పెడన నియోజకవర్గంలో ఉన్నటువంటి పెడన పట్టణంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నాయకులు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలన్నిటినీ కూడా తెలుసుకొని వాటన్నిటికీ కూడా ఎప్పటికప్పుడు పరిష్కారం చేస్తూ ప్రజల సంతృప్త స్థాయి ఎప్పుడూ కూడా ముఖ్యమైనదనే విషయంలో ముఖ్యమంత్రి నిరంతరం పని చేస్తూ ఉన్నారన్నారు. కొన్నింటికి ఇక్కడికి ఇక్కడే కూడ పరిష్కారం కూడా చేయడం జరిగిందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ శాసనసభ్యులు స్వర్ణ పెడన పేరుతో రూపొందించిన ఏప్రిల్ మాసపు వార్త లేఖను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పిడి శివ ప్రసాద్ డిపిఓ ధనలక్ష్మి, జడ్పీ డిప్యూటీ సీఈవో ఆనందకుమార్ మెప్మా పిడి సాయిబాబు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి చిన్న నరసింహులు మత్స్య శాఖ అధికారి అయ్యా నాగరాజా డీఈవో యువి సుబ్బారావు పంచాయతీరాజ్ ఎస్ఈ రమణ రావు డీఎస్ఓ మోహన్ బాబు పౌరసరఫరాల సంస్థ డిఎం శివరాం ప్రసాద్ ఆర్డబ్ల్యూఎస్ ఎస్ ఇ సోమశేఖర్ డి సి ఓ చంద్రశేఖర్ గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి వెంకటరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

## సేవా పథంలో కలిదిండి మానవతా శాఖ : బాధితులకు అండగా నిలిచిన సభ్యులు

● అగ్ని బాధితులకు నగదు, నిత్యావసరాల పంపిణీ.. ● మృతుని కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం





**కలిదిండి,మే 15 (వార్తాప్రభ) :** కలిదిండి మండలం, భాస్కరరావుపేట, దళితవాడ గ్రామంలో బుధవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా బల్ల రాజేష్ ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. సుమారు లక్ష రూపాయలు ఆస్తినష్టం జరిగినది. ఈ బాధిత కుటుంబానికి కలిదిండి మానవతా శాఖ సభ్యులు అండగా నిలిచారు. కలిదిండి మానవతా శాఖ ఆధ్వర్యంలో బాధితుడికి రూ. 5000/- లు నగదు, 25 కేజీల బియ్యం అందజేశారు. అలాగే మానవతా సభ్యులు, స్థానిక నాయకులు పోకల దుర్గ ప్రసాద్ మరియు పోకల జోగిరాజు లు కలిసి రూ. 5000/- లు, పెదలంక గ్రామ ప్రముఖులు అంకాల వెంకటాచలం గోపి 25 కేజీల బియ్యం బాధిత కుటుంబానికి అందించారు. అలాగే గుర్వాయిపాలెం గ్రామానికి చెందిన జీవరత్నం కిషోర్ బాబు ఇటీవల చనిపోయినారు. మృతుని కుటుంబానికి కలిదిండి మానవతా శాఖ మట్టి ఖర్చులు నిమిత్తం రూ. 5000/- లు అందించడం జరిగింది. అధ్యక్షుడు నూకల శ్యామల రావు గుప్తా మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు అనుకోకుండా అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు మానవతా శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయము అందించడం జరుగుతున్నదని తెలిపారు. చైర్మన్ పేటేటి వివేకానంద గురుస్వామి మాట్లాడుతూ పేద ప్రజలకు అండగా మానవతా శాఖ ఎల్లప్పుడూ ఉంటుందని తెలియజేశారు. కన్వీనర్ గోదావరి సత్యనారాయణ మాట్లాడుతూ అనారోగ్యంతో ఉంటున్న బాధితులకు అలాగే పేద విద్యార్థులకు మరియు మెరిట్ విద్యార్థులకు వారిని ప్రోత్సహించడం కోసం ఆర్థిక సహాయము అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులు నూకల శ్యామల రావు గుప్తా, చైర్మన్ పేకేటి వివేకానంద గురుస్వామి, కన్వీనర్ గోదావరి సత్యనారాయణ, గౌరవ డైరెక్టర్ మారుబోయిన రత్నారావు, గ్రామ ప్రముఖులు గోదావరి మురళి ఉపాధ్యక్షుడు కలిదిండి ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులు, డైరెక్టర్లు తదితరులు హాజరయ్యారు.

## పెద తుమ్మిడిలో జనాభా గణన ను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**కృత్తివెన్ను,మే 15 (వార్తాప్రభ) :** జనాభా గణన కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ బంటుమిల్లి మండలంలో శుక్రవారం పర్యటించారు. మండలంలోని పెదతుమ్మిడి గ్రామ సచివాలయం సందర్శించి అక్కడ ఉన్న జనాభా గణన అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. జనాభా గణన మండలంలో ఎంతవరకు జరిగిందనీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. జనాభా గణన రాష్ట్ర సంయుక్త సంచాలకులు జి ప్రసన్న కుమార్ మాట్లాడుతూ మండలంలో 14 వేల కుటుంబాల జనాభా గణన చేయవలసి ఉండగా ఇప్పటివరకు 8వేలు పూర్తి చేశారని ఇంకా 6వేలు మిగిలి ఉందన్నారు. ఎన్యూమరేటర్లు 83 మంది ఉన్నారని ఈనెల 20వ తేదీలోగా నిర్ణీత లక్ష్యం పూర్తి చేయాల్సి ఉందని కలెక్టర్కు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జనాభా గణన చాలా నిదానంగా జరుగుతోందని ఇకనైనా వేగం పెంచాలన్నారు. ఏ ప్రాంతం ప్రజలు ఏ సమయంలో ఇంట్లో ఉంటారో వివరాలు తెలుసుకొని వారు ఉండే సమయంలో వెళ్లి జనాభా గణన చేపట్టాలన్నారు. అందరూ పనులకు వెళ్లకుండా ఎవరో ఒకరు ఉన్న వారి ద్వారా పూర్తి వివరాలు సేకరించాలన్నారు. అంతేకాకుండా రోజుకు 20 ఇళ్ల చొప్పున అందరూ ప్రత్యేక దృష్టి సారించి 5 రోజుల్లో పూర్తి చేయాలన్నారు. అనంతరం పెద్ద తుమ్మిడి గ్రామస్తులు స్మశాన వాటికలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అభివృద్ధి పరుస్తున్నందులకు జిల్లా కలెక్టర్ ను ఘనంగా సత్కరించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట బంటుమిల్లి తహసీల్దారు పూర్ణచంద్రరావు ఎంపీడీవో శివప్రసాద్, జనాభా లెక్కల సూపర్వైజర్ నాగలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ప్రభుత్వ పథకాల ప్రచారకర్త భువనరాజు తదితర అధికారులు అనధికారులు పాల్గొన్నారు

## రోడ్డు మార్జిన్లు, కాలువల ఆక్రమణలపై కఠిన చర్యలు-కమిషనర్ ఎన్‌వివి.సత్యనారాయణ



**కాకినాడ,మే 15 (వార్తాప్రభ) :** రోడ్డు మార్జిన్లు,కాలువలను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్‌వివి. సత్యనారాయణ హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా అక్రమ ఆక్రమణలు కొనసాగితే సహించబోమని స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ పరిధిలోని 13వ డివిజన్ సాంబమూర్తి నగర్ ప్రాంతంలో కమిషనర్ విస్తృతంగా పర్యటించారు. సాంబమూర్తి నగర్ 1వ వీధి నుంచి 5వ వీధి వరకు పారిశుద్ధ్య పనులు, డ్రైనేజీ నిర్వహణ, చెత్త తొలగింపు పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. పారిశుద్ధ్య సిబ్బంది పనితీరుపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రోడ్ల పక్కన ఏర్పాటు చేసిన చిరు దుకాణాలు, తాత్కాలిక వ్యాపారాల వల్ల రాకపోకలకు అంతరాయం కలుగుతోందని గుర్తించిన కమిషనర్, వెంటనే వాటిని తొలగించాలని అధికారులను ఆదేశించారు. కాలువలపై నిర్మాణాలు, రోడ్డు మార్జిన్ల ఆక్రమణల కారణంగా వర్షాకాలంలో నీటి పారుదల సమస్యలు తలెత్తే అవకాశముందని తెలిపారు.నగరాన్ని పరిశుభ్రంగా, ట్రాఫిక్‌కు అనుకూలంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కమిషనర్ పిలుపునిచ్చారు. ప్రజా స్థలాలను ఆక్రమించకుండా నిబంధనలు పాటించాలని సూచించారు.ఈ తనిఖీల్లో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వి చరణ్, డీఈలు, ఏఈలు,శానిటరీ సూపర్వైజర్ సత్తెప్ప నాయుడు,తెదేపా డివిజన్ ఇంచార్జులు గాదె శివరామకృష్ణ, ఓమ్మి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## మండుటెండలో శ్రమజీవులకు టీడీపీ నాయకులు చల్లని మజ్జిగ పంపిణీ



**కిర్లంపూడి,మే 15 (వార్తాప్రభ) :** మండలంలోని జగపతినగరం గ్రామంలో మండుతున్న ఎండలను లెక్కచేయకుండా ఉపాధి హామీ పనుల్లో నిమగ్నమైన శ్రామికులకు తెలుగుదేశం పార్టీ నాయకులు మానవతా దృక్పథంతో మజ్జిగ పంపిణీ చేశారు. ఉదయం నుంచే చెమటోడ్చుతూ పనిచేస్తున్న కార్మికులకు చల్లని మజ్జిగ అందించి ఉపశమనం కల్పించారు. తీవ్ర ఉష్ణోగ్రతల మధ్య శ్రమజీవుల ఆరోగ్యం కాపాడడం అందరి బాధ్యత అని నాయకులు పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధికి వెన్నెముకలా నిలిచే ఉపాధి హామీ కార్మికుల కష్టం అపారమని, వారి శ్రమతోనే గ్రామాల్లో చెరువులు, రహదారులు, కాలువలు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. ఎండల తీవ్రత కారణంగా వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉన్నందున తాగునీరు, మజ్జిగ వంటి శీతల పానీయాలు అందించడం ద్వారా వారి ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతున్నామని చెప్పారు. మజ్జిగ స్వీకరించిన శ్రామికులు ఆనందం వ్యక్తం చేస్తూ, తమ కష్టాన్ని గుర్తించి చల్లని పానీయం అందించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మండుటెండలో ఈ చిన్న సహాయం తమకు ఎంతో ఊరటనిచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ సరిసే శివ, పెంటకోట శివ, దాడి బాబి, మళ్ళ రమేష్, చదరం బాబి, చదరం రాకేష్, చదరం రాజు తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ లెవెల్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో సత్తా చాటిన స్టేడియం క్రీడాకారులు



**గుడివాడ,మే 15 (వార్తాప్రభ) :** ఇటీవల రాజస్థాన్లోని ఉదయపూర్ లో జరిగిన జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం క్రీడాకారులు పాల్గొని వివిధ విభాగాలలో మెడల్స్ సాధించడం పట్ల స్టేడియం ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఎన్టీఆర్ స్టేడియం ఆఫీసులో జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించిన క్రీడాకారులను స్టేడియం కమిటీ అభినందించి. వారికి మెడల్స్ సర్టిఫికెట్స్ అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎన్టీఆర్ స్టేడియం ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ జాతీయస్థాయి క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యంగా తాము నిరంతరం క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అందించడం జరుగుతుందని. తద్వారా తమ క్రీడాకారులు దేశవ్యాప్తంగా ఎక్కడ క్రీడా పోటీలు జరిగిన వాటిలో పాల్గొని మెడల్స్ సాధించడం జరుగుతుందని తెలియజేశారు. పవర్ లిఫ్టింగ్ పోటీలలో ఐదుగురు క్రీడాకారులు వివిధ విభాగాలలో పాల్గొని మెడల్స్ సాధించడం ఎంతో సంతోషాన్ని కలిగించింది అన్నారు. రాబోయే కాలంలో కూడా మరింత ఉత్తమమైన శిక్షణ అందించి క్రీడాకారులను నేషనల్ పోటీలకు సిద్ధం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం సంయుక్త కార్యదర్శి కిలారపు రంగ ప్రసాద్, స్టేడియం లైఫ్ నెంబర్ లక్ష్మీ కృష్ణ వరప్రసాద్ పాల్గొన్నారు.

## ఆకులమ్మన్నాడులో లైంగిక వేధింపులకు నిరసనగా ర్యాలీ



**పెడన,మే 15 (వార్తాప్రభ) :** గూడూరు మండలం ఆకుల మన్నాడు గ్రామంలో లైంగిక వేధింపులకు నిరసనగా శుక్రవారం నాడు ర్యాలీ నిర్వహించారు మే 1 నుంచి జూన్ 12 వరకు కిశోరి వికాసం -2026 కార్యక్రమం లో భాగంగా వేసవి శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్న సంగతి తెలిసిందే .సమగ్ర శిశు అభివృద్ధి పథకం (ఐసిడిఎస్) మచిలీపట్నం ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సూపర్వైజర్ ఉషారాణి మాట్లాడుతూ సమాజంలో లైంగిక వేధింపులను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కిశోరి బాలికలు ఉన్నత చదువులు చదివి సమాజాభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్దాలి సుకన్య ఎం ఎస్ కె ఫాతిమాఅంగన్వాడీ కార్యకర్తలు ఎ ఎన్ ఎం ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.




తారకరామా వాకర్స్ క్లబ్ గుడివాడ అధ్యక్షులు బచ్చు రాధాకృష్ణ ఆధ్వర్యంలో చల్లని మజ్జిగ బాటసారిలకు మెయిన్ రోడ్డు ఐ లవ్ యు గుడివాడ దగ్గర చల్లా ఈశ్వరి దేవి కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ.. ఈ కార్యక్రమంలో కార్యదర్శి గరికపాటి సాంబశివరావు, ట్రెజరర్ పుట్టి సతీష్ బాబు మానవతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు దండమూడి సీతారామ స్వామి, తెలుగు మహిళా అధ్యక్షురాలు యార్లగడ్డ సుధారాణి, తమ్మినేని రామ్మోహన్ రావు, పుట్టి సతీష్ బాబు, సముద్రాల వెంకటేశ్వరరావు, బి శ్రీనివాసరావు, యం బలరాం తదితరులు పాల్గొన్నారు.

-గుడివాడ,మే 15 (వార్తాప్రభ) :

# ప్రత్యేక గ్రీవెన్స్ రాసాభాస..!

● కుంటముక్కల గ్రామంలో ప్రత్యేక గ్రీవెన్స్(పీజీ ఆర్ఎస్) కు సమస్యల వెల్లువ ● ఆత్కూరు గ్రామంలో భూ సమస్యలపై జిల్లా జాయింట్ కలెక్టర్ ను నిలదీసిన అధికార పార్టీ నేతలు, రైతులు ● గ్రామంలో 2.0 రీ సర్వే చేయాలన్న టీడీపీ నేతలు,రైతులు ● రీ సర్వే కాదు తప్పులు సరి చేస్తామంటున్న జాయింట్ కలెక్టర్ ఇలక్కియ ● గ్రామంలోని 600 ఖాతాలలో 400 కి పైగా ఖాతాలు తప్పులు తడకగా ఉన్నాయి.ఎలా సరి చేస్తారని జెసి ని ప్రశ్నించిన టీడీపీ నేతలు, రైతులు ● గ్రామంలో 100 మంది చనిపోయిన వారి పేరుతో కొత్తగా పాస్ పుస్తకాలు ఎలా మంజూరు చేశారని ప్రశ్నించిన అధికార పార్టీ నేతలు ● జాయింట్ కలెక్టర్ సమాధానంతో సంతృప్తి చెందని ఆత్కూరు గ్రామ రైతులు



ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువగా పరిపాలన అందించాలనే లక్ష్యంతో సీఎం మార్గదర్శకాలకు అనుగుణంగా నియోజకవర్గ స్థాయిలోనూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా ఎన్టీఆర్ జిల్లా, జి.కొండూరు మండలం కుంటముక్కల గ్రామంలో నిర్వహించి న ప్రత్యేక గ్రీవెన్స్ రాసాభాస గా మారింది.ఈ ప్రత్యేక గ్రీవెన్స్ కు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీ శ రావడం ఆలస్యం అవ్వడంతో జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలక్కియ వివిధ శాఖల జిల్లా అధికారుల తో కలిసి ప్రత్యేక గ్రీవెన్స్ ను ప్రారంభించారు.ఈ ప్రత్యేక గ్రీవెన్స్ కు పెండింగ్‌లో పడిపోయిన అంశాలు , రెవెన్యూ,భూ రికార్డుల తారుమారు, దారి సమస్య,అక్రమంగా తొవ్విన, తొవ్వబోతు న్న చేపల చెరువులు,భూ వివాదాలు మరియు ఇతర సామాజిక భద్రతకు సంబంధించిన ఫిర్యాదులతో ప్రజలు భారీగా తరలివచ్చారు. దీంతో ఈ ప్రత్యేక గ్రీవెన్స్(పీజీ ఆర్ఎస్) కు సమస్యలు వెల్లువెత్తాయి.దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న భూ సమస్యలను అధికారులకు గట్టిగా చెప్పుకునేందుకు కూడా ప్రజలకు అవకాశం లేకుండా పోయింది.తమ ఆవేదనను అధికారు లకు గట్టిగా మొరపెట్టుకునేందుకు వచ్చిన వారిని పోలీసులు, కొంతమంది అధికార పార్టీ నాయకు లు అడ్డుకోవడం విశేషం.







**జి.కొండూరు(బ్యూరో చీఫ్),మే 15 (వార్తాప్రభ) :** జి.కొండూరు మండలంలోని కుంటముక్కల గ్రామంలో ది. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పిఏసిఎస్) కార్యాలయం ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్ (పీజీఆర్ఎస్) అధికారులు,అధికార పార్టీ నేతలు రైతులు మధ్య కొంత రాసాభాస గా మారింది. ముఖ్యంగా మండలంలోని ఆత్కూరు గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులు,రైతులు తమ గ్రామంలో రీ సర్వే 2.0 చేపట్టాలని పట్టుబట్టారు. గత ప్రభుత్వం చేపట్టిన జగనన్న భూ సర్వే (రీ-సర్వే 1.0) అంతా తప్పుల తడకగా మారింద ని, ఆ సర్వే రైతులకు తెలియకుండా చేశారని, దానిని బేస్ చేసుకుని ప్రస్తుతం రెవిన్యూ శాఖ అధికారులు రీ సర్వే 2.0 పూర్తయినట్లుగా పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేశారని, దీంతో పదుల సంఖ్యలో రైతులు కోట్ల రూపాయ ల మేర నష్టపోతున్నారని జాయింట్ కలెక్టర్ ఇలక్కియ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఎప్పుడో చనిపోయిన 100 మంది పేరుతో కొత్త పాస్ పుస్తకాలు మంజూరుచేశారని అన్నారు.కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టినా రెవెన్యూ, సర్వే శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల గ్రామంలో అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు.కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలలో చనిపోయిన వారి పేర్లు, వారి ఫోటోలు ,భూ విస్తీర్ణంలో తేడాలు రావడం, భూమి లేనివారికి భూమి ఉన్నట్లు, భూమి ఉంటే అసలు భూమి లేదని,కొన్నేళ్ల క్రితమే భూమి అమ్ముకున్న వారి పేరుతో మళ్ళీ కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయటం ఏంటని అధికార పార్టీ నాయకులు జాయింట్ కలెక్టర్ ని నిలదీశారు.గ్రామంలో రీ-సర్వే 2.0 చేపట్టకుండానే పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చేందుకు రెవిన్యూ శాఖ అధికారులు సిద్ధమవ్వడం పట్ల రైతులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.గ్రామంలోని 600 ఖాతాలలో 400 కి పైగా ఖాతాలు తప్పులు తడకగా ఉన్నాయని వాటిని ఎలా సరిచేసిఇస్తారని ప్రశ్నించారు.రీ సర్వే చేస్తే తప్ప సమస్య పరిష్కారం కాదని రైతులు వాపోయారు.

**రీ సర్వే కాదు తప్పులు సరి చేస్తాం :** అయితే రీ సర్వే కాదు తప్పులు సరి చేస్తామని జాయింట్ కలెక్టర్ ఇలక్కియ అన్నారు. దీనికి అధికార పార్టీ నాయకులు, రైతులు ససేమిరా అంటున్నారు.600 ఖాతాలలో 400 కి పైగా ఖాతాలు తప్పులు ఉంటే సరిచేయడం ఎలా కుదురుతుందని అన్నారు.రైతులు జాయింట్ కలెక్టర్ మధ్య వాగ్వివాదం చోటు చేసుకోవడంతో గ్రీవెన్స్ లో కొంత గందరగోళం నెలకుంది.దీంతో స్థానిక టీడీపీ నాయకులు, పోలీసులు రంగప్రవేశం చేసి రైతులను పక్కకు తీసుకు వెళ్లారు.అనంతరం జాయింట్ కలెక్టర్ ప్రత్యేక గ్రీవెన్స్ ను కొనసాగించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

**రొయ్యల చెరువుల వల్ల త్రాగునీరు, సాగునీరు కలుషితం అవుతున్నాయి :** కుంటముక్కల గ్రామ పరిసర ప్రాంతాలలో ఏర్పాటు చేసిన రొయ్యల చెరువులు కారంణంగా భూగర్భ జలాలు, సాగునీరు కలుషితం అవుతు న్నాయని, దీంతో పంట పొలాలు దెబ్బతింటు న్నాయని ఆ గ్రామ రైతులు ప్రత్యేక గ్రీవెన్స్ లో జాయింట్ కలెక్టర్ కి పిర్యాదు చేశారు.రొయ్యల చెరువుల నుంచి వచ్చే ఉప్పునీరు,రసాయనాలు మరియు వ్యర్థాలు గ్రామంలోని బోర్లు,బావులు మరియు పంట పొలం నీటిలో కలుస్తున్నాయని దీనివల్ల త్రాగునీరు ఉప్పగా మారుతోంది వ్యవసాయ భూముల సారవంతం తగ్గుతోందని కుంటముక్కల గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.ఎలాంటి అనుమతులు లేకుండా రొయ్యల చెరువులు సాగు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు అధికారులను కోరారు. అలాగే పంచాయతీరాజ్‌కు,వైద్య ఆరోగ్యశాఖ, వ్యవసాయ శాఖ, మత్స్య శాఖ, డీఆర్‌డీఏ, పౌర సరఫరాలు, కార్మిక, పోలీసు, గ్రామీణ నీటి సరఫరా శాఖలకు సంబంధించి పిర్యాదు వచ్చాయని అధికారులు తెలిపారు.

## ప్రజలకు చేరువగా ప్రత్యేక పీజీఆర్ఎస్ - జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ





**జి.కొండూరు,మే 15 (వార్తాప్రభ) :** ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడంతో పాటు వారి సమస్యలను తెలుసుకొని, వేగవంతంగా పరిష్కరించే లక్ష్యంతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో నిర్వహించ నున్నట్లు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ వెల్లడించారు. మైలవరం నియోజకవర్గం, జి.కొండూరు మండలం, కుంటముక్కల గ్రామంలోని పిఏసిఎస్ కార్యాలయం ఆవరణలో ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమంతో పాటు ఒక నెల-ఒక గ్రామం- నాలుగు సందర్శనలు కార్యక్రమాన్ని నిర్వహించా రు.ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.ప్రతి ఫిర్యాదును పరిశీలించి, నిర్దిష్ట గడువులో పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.రెవెన్యూ కు సంబంధించి మొత్తం 61 అర్జీలు వచ్చాయి. అలాగే పంచాయతీరాజ్‌కు 9,వైద్య ఆరోగ్యశాఖ, వ్యవసాయ శాఖలకు మూడు చొప్పున, మత్స్య శాఖకు రెండు అర్జీలు వచ్చాయి.డీఆర్‌డీఏ, పౌర సరఫరాలు, కార్మిక, పోలీసు, గ్రామీణ నీటి సరఫరా శాఖలకు ఒక్కో అర్జీ వచ్చాయి.మొత్తం 83 అర్జీలు రాగా ప్రతి అర్జీపైనా ప్రత్యేకంగా దృష్టి సారించి సమస్యలకు సత్వర, నాణ్యమైన పరిష్కారాలను చూపాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను స్థానికంగానే అధికారుల దృష్టికి తీసుకువచ్చే అవకాశం ఇలాంటి కార్యక్రమాల ద్వారా కలుగుతుందని, భూ సమస్యలు, పింఛన్లు, రేషన్, తాగునీరు, విద్యుత్, గృహాలు, ఉపాధి, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించి సత్వర పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో సబ్ కలెక్టర్ వి. శ్రీనివాసరావు,స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు సమన్వయ అధికారి జి.జ్యోతి, హౌసింగ్ పిడి,ఇంచార్జ్ తహశీల్దార్ యం.విజయ్ కుమార్, ఎంపీడీవో బి వి రామకృష్ణ నాయక్, ఎంపిటిసి సభ్యురాలు జయలక్ష్మి,డిప్యూటీ కలెక్టర్ సివిల్ సప్లై మేనేజర్ సతీష్,డి పీ వొ లావణ్య కుమారి, డిఈవొ చంద్రకళ,వివిధ శాఖల జిల్లా అధికారు లు,సమగ్ర శిక్ష ఏ పీ సి రమేష్,రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ షీమా,మైలవరం ఎంపీడీవో అనురాధ,మైలవరం తహశీల్దార్ అబ్దుల్ దరియ,టీడీపీ మండల పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శు లు వేములకొండ వెంకటేశ్వరరావు, లంక నాగేశ్వరరావు, కుంటముక్కల పీ ఏ సి ఎస్ చైర్మన్ సుఖవాసి శ్రీహరి,మండల, గ్రామ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బడి బయట పిల్లల్ని బడిలో చేర్పించాలి -జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ





**జి.కొండూరు,మే 15 (వార్తాప్రభ) :** ప్రతి చిన్నారి విద్యాభ్యాసం ద్వారా ఉన్నత భవిష్యత్తును నిర్మించుకోవాలని,బడి బయట పిల్లల్ని తప్పనిసరిగా బడిలో చేర్పించా లని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ అన్నారు. మండలంలోని కుంటముక్కల గ్రామంలో జరిగిన బడి పిలుస్తోంది కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ లక్ష్మీశ జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ తో కలిసి పాల్గొన్నారు.బడిలో చేరిన చిన్నారులతో ముచ్చటించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంపీయూపీ, జెడ్పి ఉన్నత పాఠశాలలను సందర్శించి పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాలో బడి పిలుస్తోంది కార్యక్రమాన్ని ఉత్సాహవంతంగా నిర్వహిస్తున్నా మని తెలిపారు.పాఠశాల వయసు పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పించే దిశగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు, పరిశుభ్రమైన పాఠశాల వాతావరణం, డిజిటల్ విద్యా సదుపాయాలు, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు వంటి సౌకర్యాలను ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు.ఇలాంటి సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని బాగా చదువుకొని ఉన్నతంగా ఎదిగేలా ప్రోత్సహించేందుకు అవగాహన ర్యాలీలు, ఇంటింటి ప్రచారం ద్వారా తల్లిదండ్రుల్లో విద్యపట్ల చైతన్యం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ బడుల్లో విద్యా నాణ్యత కు ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాలే అందుకు నిదర్శనమని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. కార్యక్రమంలో డీఈవో ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్ష ఏపీసీ ఆర్.రమేష్ బాబు,విద్యాశాఖ అధికారులు బండి రాజు, యం.వీరాస్వామి, ఐసిడిఎస్ మైలవరం ప్రాజెక్టు పరిధిలోని జి.కొండూరు సెక్టార్ సూపర్వైజర్ డి.జోజి కటాక్షం, అంగన్వాడీ కార్యకర్తలు,సిఆర్ పీ లు,పాఠశాల ఉపాధ్యాయు లు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసులు యాదవ్ కు ఘన స్వాగతం



**విజయవాడ,మే 15 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ యాదవ్ ఎంప్లాయిస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు డి. వెంకటేశ్వర్లు యాదవ్ మరియు నెల్లూరు జిల్లా అధ్యక్షులు యన్. రవీంద్ర యాదవ్ నెల్లూరుకు విచ్చేసిన తెలుగు దేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసులు యాదవ్ కు ఆంధ్రప్రదేశ్ యాదవ్ ఎంప్లాయిస్ సొసైటీ తరపున నెల్లూరు సిటీలోని హోటల్ డి.ఆర్. ఉత్తమ్ వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసులు యాదవ్ చేతుల మీదుగా కేక్ కట్ చేయించి వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం యాదవ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వారితో చర్చించడం జరిగింది. సమస్యల పరిష్కారానికి పల్లా శ్రీనివాసులు యాదవ్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో డి. వెంకటేశ్వర్లు యాదవ్, ఎన్. రవీంద్ర యాదవ్, పి. శ్రీనివాసులు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి, వై. జానకిరామ్ యాదవ్, జిల్లా ఆర్థిక కార్యదర్శి పి.డి. రవీంద్ర బాబు, ఏ.ఈ. సురేష్ బాబులి మురళి సార్, ప్రవీణ్, పెంచలయ్య సుబ్బయ్య, సుబ్బయ్య, పాపయ్య, జగదీష్, ఆర్టీసీ శ్రీనివాసులు, ప్రసాద్, ఆర్టీసీ యూనియన్ లీడర్ రమణయ్య, పెంచలయ్య, వెంగళ రావు, వెంకటేశ్వర్లు,రమణయ్య, రాగధరబాబు, శ్రీనివాసులు, కోటేశ్వరరావు, పెంచల నరసింహులు, పెంచల సుబ్బయ్య , గోపాల్, పాపయ్య, రంగ దొరబాబు,ఏడుకొండలు, సుబ్బయ్య వెంకటేష్,శివ, శ్రీనివాసులు, మురళి, రాజేంద్రప్రసాద్, గురవయ్య, వెంగయ్య, అమర్నాథ్, కొండయ్య,రామకృష్ణ,ప్రసాద్,ఎస్ సభ్యులు పాల్గొన్నారు.

## వడదెబ్బ తగలకుండా ఉచిత హోమియో మందుల పంపిణీ



**నందిగామ,మే 15 (వార్తాప్రభ) :** శుక్రవారం పట్టణ పరిధిలోని అనాసగరం డివిఆర్ కాలనీ నందు భాను హోమియోకేర్(డాక్టర్ కాపా భాను ప్రసాద్)వారి సౌజన్యంతో గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు దుగ్గిదేవి గోపి కృష్ణ ఆధ్వర్యం లో హోమియో మందులు పంపిణీ చేశారు. ఎండలు అధికం కావడంతో ప్రజలు ,పిల్లలు ,కూలిపనులకు వెళ్ళేవారు ముందు జాగ్రత్తగా వడదెబ్బ తగలకుండా హోమియో మందులు వేసుకోవాలని గోపికృష్ణ తెలేయచేశారు.అనంతరం హోమియో మందులు సరఫరా చేసిన కాపా భాను ప్రసాద్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.

## చైతన్యవంతమైన యాదవ సంఘీయుల సహకారంతో మహిళా విభాగాన్ని బలోపేతం చేస్తా

**---అఖిల భారత యాదవ మహా సంఘం మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు పెరుమాళ్ళ పద్మజా యాదవ్**



**నెల్లూరు,మే 15 (వార్తాప్రభ) :** నెల్లూరు జిల్లా అఖిల భారత యాదవ మహా సంఘం "మహిళా విభాగం కమిటీ"ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పెరుమాళ్ళ పద్మజా యాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి విట్టపు లలితా రామ్ యాదవ్ ల ఆధ్వర్యంలో నెల్లూరు ఆమని గార్డెన్స్ లో జరిగిన కార్యక్రమంలో ఈ మేరకు నూతన జిల్లా కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పెరుమాళ్ళ పద్మజ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్నటువంటి అన్ని జిల్లాల నుండి చైతన్యవంతమైనటువంటి సంఘీయుల సహకారంతో మహిళా విభాగాన్ని పటిష్ట పరిచి యాదవ సామాజిక వర్గం యొక్క ఐక్యత కోసం తన వంతుగా కృషి చేస్తా అన్నారు. అందుకు అన్ని ప్రాంతాల వారు పూర్తి సహకారాన్ని అందించాలని అభ్యర్థించారు. ఇప్పటికే ప్రకాశం జిల్లాకు ఉన్నత విద్యావంతురాలైనటువంటి ప్రొఫెసర్ డాక్టర్ సునీత శ్రీకాంత్ ను అధ్యక్షురాలుగా నియమించడానికి ఎంపిక చేసామన్నారు. అదే విధంగా కర్నూలు, నంద్యాల, పలనాడు, గుంటూరు, బాపట్ల, కృష్ణ, ఎన్టీఆర్ జిల్లాలతో పాటు మిగతా జిల్లాలకు ఎక్కువమంది సామాజిక స్పృహ కలిగి విద్యావంతులైనటువంటి వారిని విశ్రాంతి ఉద్యోగులను, ప్రైవేటు కళాశాలలో పాఠశాలల్లో పని చేస్తున్నటువంటి ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నటువంటి మహిళలను, డాక్టర్లను ఎంపిక చేసేందుకు ఆయా జిల్లాల్లో ఉన్నటువంటి అఖిలభారత యాదవ మహా సంఘం నాయకులు తమకు సహకారం అందించాలని తద్వారా ఒకవైపు అఖిల భారత యాదవ మహా సంఘం విభాగంతో పాటు మహిళా విభాగాన్ని కూడా పటిష్ట పరుస్తామని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లా కేంద్రంలో జరిగినటువంటి అఖిలభారత యాదవ్ మహా సంఘం యొక్క సమావేశాన్ని విజయవంతం చేయడం కోసం నెల్లూరు జిల్లాలోని వివిధ మండలాల్లో పర్యటించి తాము 20 మండలాలకు కమిటీలను ఏర్పాటు చేయడశీ జరిగిందని వివరించారు. నెల్లూరు జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలుగా తమ సంఘ బాధ్యులు అందరూ ఏకగ్రీవంగా తీర్మానించి ఎంపిక చేసినటువంటి ఉడత శైలజ యాదవ్ ఎంతో బాధ్యతాయుతంగా అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు యాదవ సంఘం కూడా జరిగినటువంటి అనేక సంఘటనలలో అండగా నిలిచారన్నారు. అందువల్లనే ఆమెను ఎంపిక చేయడం జరిగిందని తెలియపరిచారు. వారితో పాటు మిగతా కార్యవర్గ సభ్యులందరినీ కూడా యాదవ మహిళల యొక్క ఉన్నతికి సహకరించే విధంగా ఎంపిక చేసుకోవడం అయినదని తెలియపరిచారు. తాను అఖిలభారత యాదవ మహా సంఘం ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్యక్షురాలుగా ఉంటూ ఈ రాష్ట్రంలో ఉన్నటువంటి యాదవుల సామాజిక సమస్యల పట్ల, వివిధ ప్రాంతాల్లో ఉన్నటువంటి శ్రీశైలంలోని సత్రంలో జరుగుతున్నటువంటి వాస్తవాలు పట్ల కూడా స్పందిస్తామని న్యాయం కోసం ఆంధ్రప్రదేశ్ లో ఉన్నటువంటి మహిళలందరితో కలిసి మన హక్కుల సాధన కోసం స్వార్థపరుల నుండి మనల్ని మనం కాపాడుకోవడం కోసం పూర్తి ధైర్యంగా బాధ్యతాయుతంగా కలిసికట్టుగా పనిచేస్తామని తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ లోని యాదవ అన్న దానాసత్రాల వద్ద ,దేవస్థానాల వద్ద యాదవ సామాజిక వర్గానికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా రాష్ట్రస్థాయిలో యాదవుల ప్రాధాన్యత పెంచేందుకు అందులో మహిళా కోటా పెంచేందుకు తాము ప్రత్యేకంగా ఒక కమిటీని అఖిల భారత యాదవ మహా సంఘం జాతీయ క్రమశిక్షణ సంఘం చైర్మన్ పిన్నిక లక్ష్మీ ప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో నాయకులతో చర్చించి ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. ఎలాంటి అవరోధాలు సృష్టించే వారినైనా నిలువరించి అభివృద్ధికి ఆటంకం లేకుండా ముందుకు తీసుకెళ్లడానికి అఖిలభారత యాదవ మహా సంఘం మహిళా విభాగం ముందుంటుందని ఆమె తెలియజేశారు. నెల్లూరు జిల్లాలో అఖిల భారత యాదవ మహా సంఘం కార్యకలాపాలను ఎక్కువ స్థాయిలో విస్తరించడం కోసం చైతన్యవంతమైన భావజాలం కలిగినటువంటి వ్యక్తుల సమూహాన్ని కలుపుకొని ముందుకు వెళుతూ అవసరమైతే త్వరలో రాష్ట్ర అధ్యక్షుడు పేరయ్య యాదవ్ తో మాట్లాడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఇంకొక వ్యక్తిని కూడా నియమించడానికి ఈరోజు జరిగిన సమావేశంలో తీర్మానించడం అయినదన్నారు. అఖిల భారత యాదవ మహా సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలుగా ఉడతా శైలజ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా వరలక్ష్మీ యాదవ్, ఉపాధ్యక్షురాలుగా వెంకటసుబ్బమ్మ, జిల్లా కార్యదర్శిగా రాచమల్లు కవిత యాదవ్ ను నియమించినట్లు ప్రకటించారు.. ఈ సందర్భంగా పద్మజ యాదవ్ మాట్లాడుతూ నెల్లూరు జిల్లా వ్యాప్తంగా అఖిలభారత యాదవ మహా సంఘాన్ని బలోపేతాన్ని చేస్తున్నామన్నారు. త్వరలోనే జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ను నియమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు యాదవ మహా సంఘం నేతలు పాల్గొన్నారు.

## ఘనంగా తిరువూరు ఏఎంసి వైస్ చైర్మన్ జన్మదిన వేడుకలు



**విస్సన్నపేట,మే 15 (వార్తాప్రభ) :** స్థానిక కేఎంఆర్ వాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో వైభవ్ జ్యుయలరీ అధినేత తిరువూరు ఏఎంసీ వైస్ చైర్మన్ కుక్కడపు వెంకట నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సామాజిక వర్గ పెద్దలు పాల్గొన్నారు.

## 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కొల్లాబత్తుల సూర్య కుమార్

### - కొల్లాబత్తులకు దక్కిన గౌరవం



**పాలకొల్లు ,మే 15 (వార్తాప్రభ) :** డా.కత్తిమండ ప్రతాప్ సారధ్యంలో తెలుగు భాషాభివృద్ధి, సాహిత్య ప్రోత్సాహానికి కృషి చేస్తున్న శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలకు పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన సాహిత్యాభిమాని, కవి, రచయిత మరియు ఉపాధ్యాయుడైన కొల్లాబత్తుల సూర్య కుమార్ ను ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు శ్రీశ్రీ కళావేదిక జాతీయ అధ్యక్షురాలు జి.ఈశ్వరి భూషణం, జాతీయ ప్రణాళిక అధికారి టి. పార్థసారధి ల ద్వారా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. తెలుగు భాష పరిరక్షణ, సాహిత్య వికాసం వంటి పలు కార్యక్రమాల్లో సూర్య కుమార్ చురుకుగా పాల్గొంటూ ప్రత్యేక గుర్తింపు పొందినట్లు కళావేదిక ప్రతినిధులు తెలిపారు. ఆయన సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. జూన్ 6,7వ తేదీల్లో రాజమహేంద్రవరం గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో ఈ మహాసభలు వైభవంగా నిర్వహించనున్నారు. దేశ విదేశాల నుంచి తెలుగు కవులు, రచయితలు, సాహితీవేత్తలు, కళాకారులు పాల్గొననున్న ఈ మహాసభలు తెలుగు సంస్కృతి, సాహిత్య వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పే వేదికగా నిలుస్తాయని నిర్వాహకులు తెలిపారు.ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నియమితులైన సూర్య కుమార్ మాట్లాడుతూ తెలుగు భాషకు సేవ చేసే అవకాశం రావడం ఆనందంగా ఉందని,మహాసభలను విజయవంతం చేసేందుకు కృషిచేస్తానని అన్నారు.ఈ సందర్భంగా పలువురు సాహిత్యాభిమానులు, మిత్రులు ఆయనకు అభినందనలు తెలిపారు.

## ఘనంగా ముగిసిన శ్రీ సీతారామ దాసాంజనేయ స్వామి వారి 76వ హనుమజ్జయంతి మహోత్సవములు



**హనుమాన్ జంక్షన్,మే 15 (వార్తాప్రభ) :** దశాబ్దాల చరిత్ర కల్గిన స్థానిక నూజివీడు రైల్వే ఫ్లైఓవర్ వద్ద వేంచేసియున్న శ్రీ సీతారామ దాసాంజనేయస్వామివారి ఆలయ సన్నిధిలో పల్నాటి సత్యనారాయణ, చోడె వెంకయ్య కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో 76వ హనుమజ్జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాల చివరిరోజు శుక్రవారం ఉదయం 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం మరియు సుమారు 6,000 మంది భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ స్వామి వారిని దర్శించుకొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188